

గిరిజన విజ్ఞానాన్ని పరిరక్షించుకుందాం
నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ 6

కేబినెట్ 'వరాలు'



- పుష్కర ఎత్తిపోతల పథకం పైపులైన్ల మార్పునకు ఆమోదముద్ర
- రూ.51.67 కోట్లతో పరిపాలన ఆమోదం ఇచ్చే ప్రతిపాదనకు పచ్చజెండా
- 31వేల ఎకరాల ఆయకట్టుకు ఊపిరిలూదిన సీఎం చంద్రబాబు
- గ్రామ, వార్డు సచివాలయాల్లో పోస్టుల భర్తీకి ఆమోదంతో ఊరట
- చింతూరు ఆసుపత్రి 50 నుంచి వంద పడకలుగా మార్పునకు ఓకే

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జగ్గంపేట నియోజకవర్గంలో కీలకమైన తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం తీపికబురు అందించింది. గత వైసీపీ హయాంలో పైపులైన్లు మరమ్మతుకు గురై మూలనపడ్డ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు ఊపిరి పోశారు. పాడైపోయిన కీలక పైపులైన్ల స్థానంలో కొత్తవి నిర్మించడానికి మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. రూ.51.67 కోట్లతో పనులు చేపట్టేందుకు వీలుగా పరిపాలన ఆమోదం ఇచ్చే ప్రతిపాదనకు పచ్చజెండా ఊపింది. దీంతో 31వేల ఎకరాల ఆయకట్టుకు తిరిగి నీరు అందబోతోంది. గండేపల్లి మండలం తాళ్లూరు వద్ద నిర్మించిన ఈ పథకం ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు గురైంది. దీనికి శంకుస్థాపన నుంచి టెండర్లు పిలిచి పనుల ప్రారంభం వరకు అప్పట్లో టీడీపీ ప్రభుత్వంలోనే జరిగింది. తీరా వైఎస్ సీఎం అయిన తర్వాత ప్రాజెక్టు పనుల్లో మార్పులు చేశారు. సాగునీరు ప్రవహించడానికి ఇనుప పైపులు బదులు సిమెంట్ పైపులు వినియోగించారు. దీంతో కాలక్రమేణా సిమెంట్ పైపులపై ఒత్తిడి పెరిగి ఎందుకు పనికి రాకుండా పోయాయి. గత వైసీపీ హయాంలో వీటికి మరమ్మతులు చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. దీంతో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దాదాపు 14సార్లు సీఎం చంద్రబాబు దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. చంద్రబాబు మానసపుత్రికలాంటి ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదల చేయాలని కోరారు. దీంతో ప్రయత్నాలు ఫలించి పీఎస్సీ ప్రెజర్ మెయిన్‌ను ఎంఎస్ ప్రెజర్ మెయిన్‌తో మార్చే పనికి టెండర్లను ఆహ్వానించి రూ.51.67 కోట్లతో పరిపాలన ఆమోదం ఇచ్చే ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదించింది. దీనిపై ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్పందిస్తూ సీఎం చంద్రబాబు రుణం తీర్చుకోలేనిదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పైపులైన్ల మరమ్మతులకు నిధులు అడిగితే రూ.25 లక్షలు విదిల్చారని, కానీ ఇప్పుడు సీఎం చంద్రబాబు రూ.51.67కోట్లు విడుదలకు నిర్ణయించడం గొప్ప విషయమన్నారు. ఇక గ్రామ, వార్డు సచివాలయాల్లో డిప్యుటేషన్, అవుట్ సోర్సింగ్ విధానం కింద 2,778 పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న 1,500 పోస్టుల్లో 700వరకు పోస్టులను భర్తీ చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. అలాగే చింతూరులో ఉన్న 50పడకల ఆసుపత్రిని వంద పడకలస్థాయికి పెంచుతూ ఆమోదించింది.

వరద గోదారి


రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద వరద ఉధృతి

- ఎగువ నుంచి గోదావరికి భారీగా వచ్చి చేరుతున్న వరద
- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- అఖండ గోదావరిలో ఉగ్రరూపం.. ఘాట్లను ముంచెత్తుతూ ప్రవాహం
- మునుగుతున్న లంకలు.. సురక్షిత ప్రాంతాలకు మత్స్యకార కుటుంబాలు
- 400 మంది పునరావాస కేంద్రాలకు తరలింపు.. భోజన, వసతి ఏర్పాట్లు
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు.. బాధితులకు కలెక్టర్ పరామర్శ


రాజమహేంద్రవరం సమీపంలో బ్రిడ్జిలంక నుంచి బోటుపై బయటకు వస్తున్న మత్స్యకార కుటుంబాలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఎగువన వర్షాలు కురుస్తుండడంతో గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో అఖండ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. రోడ్ కం రైలు బ్రిడ్జి సహా అన్ని బ్రిడ్జిలను శరవేగంగా తాకుతూ వరద పరవళ్లు తొక్కుతోంది. ఇటు రాజమహేంద్రవరం, అటు కొవ్వూరు వైపు ఉన్న ఘాట్లన్నీ వరదలో మునిగి ఉన్నాయి. గోదావరిలో లంకలు నీటమునగడంలో అక్కడ నివసిస్తున్న మత్స్యకార కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వారికి పునరావాస చర్యలను కలెక్టర్ ప్రశాంతి ఇప్పటికే చేపట్టారు. ఇక ధవళేశ్వరం బ్యారేజీ నుంచి రాత్రి పది గంటలకు 12,12,742 క్యూసెక్కుల వరద దిగువకు సముద్రంలోకి వెళుతోంది. దాంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో ప్రతి ఏడాది మాదిరిగానే గోదావరి లంకలు వరద బారిన పడ్డాయి. కొన్ని ఇళ్లు మునిగిపోయాయి. దీంతో మత్స్యకార కుటుంబాలను అధికారులు పునరావాస కేంద్రానికి తరలించారు. ఆల్కాట్ గార్డెన్ సమీపంలోని కల్యాణ మండపంలో వరద ప్రభావిత కుటుంబాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. పడవలను ఒడ్డున లంగరు వేసి అక్కడి కొందరు మత్స్యకార యువకులు కాపలా ఉంటున్నారు. మిగతా వాళ్లు పునరావాస కేంద్రంలో ఉన్నారు. కేతావారిల లంక, వెదుర్లమ్మ లంక, బ్రిడ్జి లంక, గౌతమీ ఘాట్ లంక నుంచి సుమారు 400 మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. ఇక్కడ అవసరమైన అన్ని వసతులను అర్బన్ తహశీల్దారు పీహెచ్‌జీ పాపారావు చూస్తున్నారు. సచివాలయ సిబ్బంది వంతుల వారీగా విధులు నిర్వర్తిస్తూ ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నారు. ఉదయం ఆరు గంటలకు రెండు రకాల టిఫిన్, టీ, సాయంత్రం 4గంటలకు స్నాక్స్, టీ, కాఫీ, మధ్యాహ్నం 12 గంటలకు, రాత్రి 7 గంటలకు స్వీటు, రెండు కూరలు, పచ్చడి, సాంబారు, పెరుగు, వడియాలతో భోజనం వడ్డిస్తున్నారు. చిన్న పిల్లలకు పాలు అవసరమైతే అందిస్తున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ మిషన్, మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి పలు రకాల మందులను అందుబాటులో ఉంచారు. దీంతో తమను కన్నబిడ్డల్లా చూసుకుంటున్నారని మత్స్యకార మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. కాగా వైసీపీ ప్రభుత్వ హయాంలో వరద పునరావాస కేంద్రాలోని వాళ్లకు ఉదయం టిఫిన్, టీ, మధ్యాహ్నం, రాత్రి భోజనానికి కలిపి ప్రైవేటు కేటరింగ్ వాళ్లకు రూ.320 ఇచ్చేవారు. ఇప్పుడు రూ.30 పెంచి నాణ్యమైన భోజనం ఆహారం అందించాలని ఆదేశించింది. ఇక పునరావాస కేంద్రంలో 120 మంది వరకూ మహిళలు ఉన్నారు. వీళ్లలో ఐదుగురు గర్భవతులు ఉన్నారు. అలాగే 70 ఏళ్ల నిండిన వృద్ధులు, నడుంనొప్పి వంటి రుగ్మతలు ఉన్నవాళ్లు కూడా నేలపై పడుకోడానికి ఇబ్బందిపడుతున్నారు. వాళ్లకైనా మంచాలు ఏర్పాటు చేయాలని మత్స్యకార పెద్దలు కోరుతున్నారు. గర్భవతులకు వారి కోరిక మేరకు మరింత పౌష్టికాహారం అందించాలని, పిల్లల వరకైనా భోజనంలో ఉడికించిన గుడ్డు ఉంటే ఇష్టంగా తింటారని అంటున్నారు.

ఇక్కడే వండించండి : కలెక్టర్

పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ ప్రశాంతి గురువారం ఉదయం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిశుభ్రత పాటించాలని, సురక్షిత తాగునీరు మాత్రమే అందుబాటులో ఉంచాలని చెప్పారు. భోజనంలో మసాలాలు ఎక్కువవుతున్నాయని, పిల్లలు తినడం కష్టమవుతోందని మత్స్యకారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పునరావాస కేంద్రంలో వారికి తగినట్టు అక్కడే వండించాలని ఆమె ఆదేశించారు.

పరిస్థితిని పర్యవేక్షించిన ఆర్డీవో

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల నేపథ్యంలో బ్రిడ్జిలంకలో ఉన్న మత్యకార కుటుంబాలకు చెందిన 40 మందిని చందాసత్రంలో నగరపాలక సంస్థ ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. గురువారం రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ స్వయంగా మత్సకారుల వద్దకు వెళ్లి 40 మందిని బోట్లలో తరలింపజేశారు. వరదలు పెరుగుతున్నందున మత్యకారులెవరూ లంకల్లో ఉండవద్దని సూచించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.




ఆల్కాట్ గార్డెన్ సమీపంలో కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రం.. పునరావాస కేంద్రంలో ఉన్న వారితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి.. నిరాశ్రయులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణనాయక్

వచ్చే నెలలో గృహయోగం

- జిల్లాలో 10,794 ఇళ్లను సిద్ధం చేసే యత్నం
- ఇప్పటికే 6,974 పూర్తి

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

పేదలకు గృహయోగం రానుంది. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పేదలకు సొంతింటి కలనెరవేరబోతోంది. వచ్చే నెలలో జిల్లాలో 10,794 ఇళ్లను పూర్తిచేసి పేదలు గృహ ప్రవేశం చేసేలా జిల్లా యంత్రాంగం ప్రయత్నిస్తోంది. కలెక్టర్ పి.ప్రశాంతి నిత్యం గృహ నిర్మాణాలను ప్రగతిని పరిశీలిస్తూ పనుల్లో వేగం పెంచారు. రాజధానిలో బుధవారం జరిగిన గృహ నిర్మాణశాఖ అధికారుల సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయంపై స్పష్టమైన ఆదేశాలిచ్చినట్టు సమాచారం. ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబరు నెలలో పేదల గృహ ప్రవేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. జిల్లాలో చాలా ఇళ్లు నిర్మాణంలో ఉన్నప్పటికీ, సెప్టెంబరులో 10,794 ఇళ్లలోకి గృహ ప్రవేశాలు ఉండేలా చూడనున్నారు. ఇప్పటికే 6,974 ఇళ్లను పూర్తిచేశారు. ఈనెలాఖరు నాటికి చాలా వరకూ పూర్తి చేసే లక్ష్యంతో అధికారులు చర్యలు చేపట్టారు. సెప్టెంబర్ నెలాఖరులోపు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించి పేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చనున్నారు. అయితే కొన్ని మండలాల్లో వివిధ సమస్యలతో ఇళ్ల నిర్మాణం నెమ్మదిగా జరుగుతోంది. అధికారులు మాత్రం సుమారుగా పూర్తవుతాయని, గృహ ప్రవేశాలకు సిద్ధమవుతామని చెబుతున్నారు. రాజమండ్రి అర్బన్ పరిధి పేదల కోసం వెలుగుబందలో 3096 ఇళ్లను నిర్మిస్తున్నారు. ఇప్పటివరకూ 2,784 పూర్తయ్యాయి. ఇది 90 శాతం. ఇంకా 312 ఇళ్లు పూర్తి చేయవలసి ఉంది. అవి వివిధ దశల్లో ఉన్నాయి. ఇవి కాకుండా ఎన్టీఆర్ గృహ నిర్మాణం కింద జిల్లాలో 1,483 మందిని ఎంపిక చేశారు. సొంత స్థలం ఉన్నవారిని ఇంటి రుణం మంజూరు చేయడం ఈ పథకం లక్ష్యం. కానీ చాలామంది ఇళ్లను శ్లాబ్ వరకూ నిర్మించి నిధుల కోసం ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. వీటికి కూడా సత్వరం రుణాలు ఇవ్వడానికి వీలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు సంబంధిత అధికార్లను ఆదేశించారు. లేఅవుట్లలో మిగతా ఇళ్ల నిర్మాణాలను జనవరికి పూర్తి చేసే లక్ష్యాలను నిర్దేశించారు.

మండలాల వారీగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు

మండలం	గృహాల లక్ష్యం	నిర్మాణం పూర్తి	పెండింగ్
గోపాలపురం	474	364	110
నల్లజర్ల	563	429	134
నిడదవోలు	338	247	91
దేవరపల్లి	699	510	189
రాజానగరం	289	207	82
కోరుకొండ	266	188	78
గోకవరం	211	143	68
పెరవలి	138	88	50
తాళ్లపూడి	284	173	111
నిడదవోలు అర్బన్	223	125	98
కడియం	219	122	97
రంగంపేట	304	154	151
ఉండ్రాజవరం	306	143	163
కొవ్వూరు అర్బన్	595	272	323
చాగల్లు	385	169	216
రాజమండ్రి రూరల్	295	125	175
కొవ్వూరు రూరల్	460	193	267
సీతానగరం	269	96	173
బిక్కవోలు	695	228	467
అనపర్తి	685	215	470

37 స్టాక్ పాయింట్లలో 12,97,874 మె.టన్నుల ఇసుక : కలెక్టర్

రాజమహేంద్రవరంసిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 37 స్టాక్ పాయింట్లలో 12,97,874 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన చేస్తూ వర్షాల కారణంగా ఎక్కడా ఇసుక కొరతలేకుండా ముందుగానే ఇసుకను స్టాక్ పాయింట్లలో అవసరాలకు తగ్గట్టుగా అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇతర జిల్లాల అవసరాల కోసం 3,57,993 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని చెప్పారు. అరికిరేవుల ఎస్ఎం స్టాక్ పాయింట్‌లో 69,748 మెట్రిక్ టన్నులు, చిడిపి మాన్యువల్ రీచ్ స్టాక్ పాయింట్‌లో 20,457 మెట్రిక్ టన్నులు, చిడిపి ఎస్ఎంలో 59,432 మెట్రిక్ టన్నులు, దొండగుంట-1డిసిల్ట్ పాయింట్‌లో 26,509 మెట్రిక్ టన్నులు, ధవళేశ్వరం స్టాక్ పాయింట్‌లో 1,01,096 మెట్రిక్ టన్నులు, ఏరినమ్మ-1స్టాక్ పాయింట్‌లో 2,976 మెట్రిక్ టన్నులు, జీడిగుంట ఎంఆర్ స్టాక్ పాయింట్‌లో 18,505 మెట్రిక్ టన్నులు, కాకరపర్రు స్టాక్ పాయింట్‌లో 43,407 మెట్రిక్ టన్నులు, కాటవరం స్టాక్ పాయింట్‌లో 12, 142 మెట్రిక్ టన్నులు, కాతేరు స్టాక్ పాయింట్‌లో 77,442 మెట్రిక్ టన్నులు, కోటిలింగాలు-2 స్టాక్ పాయింట్‌లో 27,432 మెట్రిక్ టన్నులు, కుమారదేవం -1 స్టాక్ పాయింట్‌లో 20,989 మెట్రిక్ టన్నులు తదితర స్టాక్ పాయింట్లలో జిల్లా అవసరాలకు 9,39,881 మెట్రిక్ టన్నులు ఇసుక అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు.

ఆవిష్కరణలు ఒక అలవాటు కావాలి


ఉత్తమ ప్రదర్శనకు జ్ఞాపిక అందిస్తున్న ఆదిరెడ్డి, బొడ్డు

- సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి.. విజయవంతంగా రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్-2025.. 150 టీమ్‌లు హాజరు
- యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని హామీ.. హాజరైన రుడా చైర్మన్ వెంకట రమణచౌదరి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): యువత వినూత్న ఆలోచనలతో ఆవిష్కరణలను ఒక అలవాటుగా చేయడమే తమ లక్ష్యమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. మహా నగరాల్లో మాత్రమే నిర్వహించే ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్‌ను 'రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్-2025' పేరుతో రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నిర్వహించారు. గురువారం హోటల్ మంజీరాలో భవాని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో నిర్వహించిన ఈ సమ్మిట్-2025లో 150 టీమ్‌లు తమ ఆవిష్కరణలతో హాజరయ్యారు. తొలుత ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వాసు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, జనసేన నగర అధ్యక్షుడు వై శ్రీనులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ వరల్డ్ ఎంటర్ ప్రెన్యూర్ డేను పురస్కరించుకుని ఒకరోజు ముందుగానే రాజమహేంద్రవరంలో తమ ట్రస్టు సౌజన్యంతో వినూత్న రీతిలో ఐడియా పిచ్ పేరుతో యువతలో నైపుణ్యాలు ప్రదర్శించడానికి ఈ వేదిక చక్కటి అవకాశం కల్పించిందన్నారు. ఈ వర్క్‌షాపులో సుమారు 150 టీమ్‌లు వారి ఆవిష్కరణలతో హాజరుకావడం గొప్ప విషయమని అభినందించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వారు యువ పారిశ్రామివేత్తలుగా ఎదగడానికి దోహదపడేందుకు ఈ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందన్నారు. 15 నెలల కిందట తాను రాజమండ్రి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే ఇంక్యూబేషన్ సెంటర్‌గా తీర్చిదిద్దుతానని, యువత అద్భుతాలు చేస్తారని తాను యువనేత నారా లోకేశ్‌కు ఆనాడే చెప్పానని, తన మాటలు విన్న కొందరు ఇంక్యూబేషన్ సెంటర్ ఏమిటన్నట్టు మాట్లాడారని గుర్తుచేశారు. తన ఆలోచనలకు తగినట్టుగానే కూటమి ప్రభుత్వం అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుచేసి మరో ఐదు కేంద్రాల్లో కూడా వాటి ఏర్పాటుకు అనుమతి ఇచ్చిందని, అందులో రాజమండ్రిని ఎంచుకున్నందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణచౌదరి మాట్లాడుతూ భవాని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఇలాంటి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్ నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. ప్రధాని మోదీ వికసిత భారత్ ఆశయాలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ముందుకు తీసుకువెళ్తూ ప్రతి ఇంటిలోను ఒక పారిశ్రామికవేత్త ఉండేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.


సమ్మిట్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి, రుడా చైర్మన్ బొడ్డు, సీఈవో ఆరుమిల్లి తదితరులు

ఆ ప్రాజెక్టుకు రూ.కోటి 50 లక్షలు వెచ్చిస్తాం : ఆరుమిల్లి

రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్-2025లో ప్రదర్శించిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ ఆధునిక ప్రపంచానికి తగ్గట్టుగా నేటి తరం, అలాగే భవిష్యత్ తరాలకు తగిన విధంగా రూపొందించిన ప్రాజెక్టుల్లో ఫ్రెష్‌పాడ్ హెల్మెట్ తిసిన్నికెన్ట్ మిషన్ ప్రాజెక్టు ఎంతో ఆకర్షణగా ఉండి నచ్చడంతో ఈ ప్రాజెక్టులో ఇన్వెస్ట్‌మెంట్ పెట్టేందుకు జార్విస్ సంస్థ సీఈవో ఆరుమిల్లి ముందుకు వచ్చారు. సుమారు కోటి 50 లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టేందుకు ఆయన ఆసక్తి చూపారు. అలాగే మార్విన్ ఏరో స్పెస్ ప్రాజెక్టు కూడా ఆయనకు నచ్చడంతో ఆ ప్రాజెక్టుకు కూడా ఆయన పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆరుమిల్లి మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో చాలా చక్కటి సమ్మిట్ జరిగిందన్నారు. ప్రతి ప్రాజెక్టు చాలా సృజనాత్మకంగా భవిష్యత్తు తరాలకు బాగా ఉపయోగపడేలా ఉన్నాయని పేర్కొన్నారు.

రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్-2025లో ప్రథమ బహుమతి విజేత అమలాపురం టీమ్ 7

భూగర్భ జలాల పునరుద్ధరణకు చర్యలు

- స్వామిత్ర సర్వే వేగవంతం
- లోవోల్టేజీ ఉండొద్దు
- కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ విధానంలో సమావేశమయ్యారు. కలెక్టరేట్ నుంచి ప్రశాంతి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రీ-మాన్సూన్ భూగర్భజల స్థాయి 8మీటర్లకంటే ఎక్కువ లోతులో ఉన్న గ్రామాల్లో భూగర్భ జలాల రీచార్జి కోసం ఉపాధి హామీ పథకం ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సుమారు 80 గ్రామాల్లో భూగర్భ జలాలు నిర్ధారిత స్థాయి కంటే ఎక్కువ లోతుకు వెళ్లిపోయినట్టు భూగర్భ జలాల విభాగం సర్వేలో తేలిందన్నారు. ఆ గ్రామాల్లో చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, పెర్కొలేషన్ ట్యాంకులు, రీచార్జి పిట్లు వంటి వాటర్ కన్జర్వేషన్ పనులు వెంటనే చేపట్టాలని చెప్పారు. సెప్టెంబరు 1 నాటికి జిల్లాలో ఎంత మేరకు నీరు నిల్వలో ఉందో, ఎంత మేర కన్జర్వేషను పనులు జరిగాయనే వివరాలతో వాటర్ బులెటిన్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాల్సి ఉందన్నారు. గ్రామ కంఠాల్లోని ఇళ్లకు, ఖాళీ స్థలాలకు యాజమాన్య హక్కులు కల్పించడానికి చేపట్టిన 'స్వామిత్ర సర్వే'ను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో రెండో దశలో 102 గ్రామాల్లో రీ-సర్వే జరగాల్సి ఉండగా ఇప్పటి వరకూ 65 గ్రామాల్లో పూర్తయిందని, మిగిలిన వాటి విషయంలో కూడా త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు చెప్పారు. ఈ నియామకాలతో ప్రభుత్వం తరఫున న్యాయ వ్యవహారాల నిర్వహణ వేగం అవుతుందన్నారు. అలాగే లో-వోల్టేజీ సమస్యలు రాకుండా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జేసీ చిన్న రాముడు, డీఆర్వో సీతారామమూర్తి, సీపీవో అప్పలకొండ, డీఎల్‌డీవోలు వీణాదేవి, స్లీవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాము కలెక్టర్ తనిఖీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌సీఐ గోదాముల్లోని ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, తహశీల్దారు పాపారావుతో కలిసి కలెక్టర్ పి.ప్రశాంతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతి నెలా ఈవీఎంలు భద్రపరిచిన గోదామును తనిఖీ చేస్తున్నామన్నారు. ఈవీఎం యూనిట్లను అత్యంత భద్రతతో స్ట్రాంగ్ రూములో ఉంచామని, సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. కెమెరాల పనితీరును కూడా పరిశీలించామని తెలిపారు.



గణనాథుల విగ్రహాలకు తుది మెరుగులు అద్దుతున్న కళాకారులు

ఆ పల్లెటూళ్లో 1364 మంది జనాభా ఉండగా 440 కుటుంబాలు ఉన్నాయి. బొమ్మల తయారీ ద్వారా ఇక్కడ ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఎంతోమంది ఉపాధి పొందుతుంటారు. ఏ ఇల్లు చూసినా రకరకాల బొమ్మలతో దర్శనమిస్తాయి. ఏడాది పొడవునా విగ్రహాలు తయారు చేస్తారు. వినాయకచవితికి బొమ్మల తయారీకి ఒక ప్రత్యేకత ఉంది. మూడు, నాలుగు నెలల ముందే బొమ్మల తయారీలో కళాకారులు నిమగ్నమవుతారు. మట్టితో ఐదు అంగుళాల నుంచి 10 అడుగుల వరకు బొమ్మలు తయారు చేస్తారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ అయితే అడుగు నుంచి 15 అడుగుల వరకు తయారు చేస్తుంటారు. ఆ గ్రామమే గాడిలంక.



బొమ్మను చేసి... ప్రాణము పోసి...

- ఆ గ్రామం బొమ్మల పొదరిల్లు
- బొమ్మల తయారీలో పెట్టింది పేరు గాడిలంక
- సుమారు 150 ఏళ్ల చరిత్ర
- గణనాథుల విగ్రహాలతో కళకళలాడుతున్న వైనం

ముమ్మిడివరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మట్టికి ప్రాణం పోసే దేవుళ్లు అక్కడ ఉన్నారు. అక్కడ శిల్ప కళాకారుల చేతిలో మట్టి అద్భుతమైన కళాఖండాలుగా రూపుదిద్దుకుంటుంది. పచ్చని పంట పొలాల మధ్య ఆ గ్రామం రంగురంగుల బొమ్మలతో కళకళలాడుతుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం గాడిలంక బొమ్మల తయారీకి పెట్టింది పేరు. ఇక్కడ బొమ్మల తయారీకి సుమారు 150 ఏళ్ల చరిత్ర ఉంది. అప్పట్లో పెద్దిరెడ్డి వెంకన్న అనే శిల్పి గ్రామంలో తొలిసారి బొమ్మల తయారీని ప్రారంభించారు. ఆ తర్వాత అతని కుమారుడు అచ్చుతరామయ్య ద్వారా మిగతా వారు శిల్పకళ నేర్చుకున్నారు. గ్రామంలో 80 వరకు బొమ్మల పరిశ్రమలు ఉండేవి. ప్రస్తుతం బొమ్మల తయారీలో లాభసాటి కరువవడంతో 15 కంపెనీలకు పరిమితమయ్యాయి. గ్రామంలో వందలాది మంది కళాకారులు వినాయకచవితి సీజన్‌లో వేలాది బొమ్మలు తయారుచేస్తుంటారు. ఇక్కడి నుంచి దేశ, విదేశాలకు కూడా విగ్రహాలు ఎగుమతి అవుతాయి. చిన్నబొమ్మల తయారీకి జిగురు మట్టిని నానబెట్టి కాగిత గుజ్జు, నావసుద్ద కలిపి మెత్తగా కుమ్మి మిశ్రమం తయారు చేస్తారు. పెద్దపెద్ద బొమ్మలను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేస్తారు. ముందుగా మూసలు తయారు చేసుకుని వాటి ఆధారంగా తీర్చిదిద్దుతారు. పెద్ద విగ్రహాలు అయితే విడి భాగాలు తయారుచేసి వాటిని అతుకుతారు. ఇక్కడ తయారైన బొమ్మలను కర్ణాటక, ఒడిసా, మహారాష్ట్ర, నల్గొండ, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, మంచిర్యాల తరలించి అక్కడ విక్రయిస్తారు. ప్రతి సీజన్లోనూ రూ.కోటి నుంచి రూ.కోటీ 50 లక్షల వరకు విలువైన బొమ్మలు ఇక్కడి నుంచి ఎగుమతి అవుతాయి. ప్రముఖ శిల్పి పెద్దిరెడ్డి వెంకటకృష్ణ మాధవరావు ఆర్డరుపై దేశ నాయకులు, రాజకీయ నాయకులు, ప్రముఖుల విగ్రహాలు తయారు చేస్తారు.

కూలీల కొరత, కూలీ రేట్లు పెరిగిపోవడం, ముడి సరుకుల రేట్లు పెరిగిపోవడం వంటి వాటితో బొమ్మల తయారీలో గిట్టుబాటు కరువైంది. దీంతో ఇటీవల బొమ్మల తయారీ కొంత తగ్గింది. కళాకారుల జీవనోపాధి దెబ్బతింది. కొంత మంది యువత ఈ వృత్తికి స్వస్తి పలికి ప్రత్యామ్నాయ వృత్తుల వైపు వెళ్లారు. మరికొంతమంది అయితే ఇతర వృత్తులు చేపట్టలేక, వంశపారంపర్యంగా వస్తున్న వృత్తిని వదులుకోలేక కాలక్షేపం చేస్తూ ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు. బొమ్మల తయారీని ప్రభుత్వం కుటీర పరిశ్రమగా గుర్తించి కళాకారులకు ఆర్థిక చేయూత ఇవ్వాలని వారు కోరుతున్నారు.



గణనాథుల ప్రతిమలను తయారు చేస్తున్న శిల్ప కళాకారులు

ప్రభుత్వం ఆర్థిక చేయూతనివ్వాలి

కొమ్మిరెడ్డి రాజేశ్వరి, శిల్ప కళాకారిణి



అత్తింటివారి సంప్రదాయబద్ధంగా వస్తున్న బొమ్మల తయారీ నేర్చుకున్నా. పదేళ్ల నుంచి కుటుంబసభ్యులతో కలిసి బొమ్మలు తయారుచేస్తున్నా. దీంతో కొంత ఉపాధి లభిస్తోంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే బొమ్మల తయారీ వల్ల కళాకారులకు మరింత ఉపాధి చేకూరుతుంది.

పెన్షన్ సదుపాయం కల్పించాలి

కొమ్మిరెడ్డి సూర్యచంద్రరావు, శిల్ప కళాకారుడు



40 ఏళ్లుగా బొమ్మలు తయారు చేస్తున్నాం. అంతగా గిట్టుబాటు లేదు. అలవాటైన వృత్తిని వదులుకోలేక బొమ్మలనే తయారు చేస్తున్నాం. బొమ్మలకు పెయింటింగ్ వేయడం వల్ల ఆ రోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. కంటిచూపు మందగిస్తుంది. 50 ఏళ్లు నిండిన కళాకారులకు పెన్షన్ సదుపాయం కల్పించాలి. ప్రత్యేక సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.

గిట్టుబాటు ధర కరువైంది

మహాదశ సత్యగణేశ్వరరావు, శిల్పి



గత 40 ఏళ్లుగా ఇదే వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. ప్రస్తుతం అంతగా గిట్టుబాటు లభించట్లేదు. తయారీ భారంగా మారింది. ప్రభుత్వం ప్రోత్సాహం లభించట్లేదు. కూలీల కొరత, ముడిసరుకు రేట్లు పెరిగిపోవడంతో బొమ్మల తయారీ గిట్టుబాటు కావట్లేదు.

కుటీర పరిశ్రమగా ప్రోత్సహించాలి

పెద్దిరెడ్డి సత్యనారాయణమూర్తి, శిల్పి



మా తాతల నాటి నుంచీ సంప్రదాయంగా వస్తున్న ఈవృత్తిని మేమూ సాగిస్తున్నాం. 40 ఏళ్లుగా బొమ్మలు, విగ్రహాల తయారీలో ఉన్నాను. వాటికి డిమాండ్ ఉన్నా గిట్టుబాటు లభించట్లేదు. పరిశ్రమను నడపలేక పోతున్నాం. రోజంతా శ్రమించినా రోజు కూలీ మాత్రమే కిడుతోంది. ప్రభుత్వం కుటీర పరిశ్రమగా గుర్తించి ప్రోత్సహించాలి.



కాకినాడలో విద్యార్థులకు తోలుబొమ్మలాట జానపద కళపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

కళను బతికిద్దాం!

- భవిష్యత్తు తరాలకు దూరమవుతున్న జానపద కళలు
- ఆదుకోవాలంటున్న కళాకారులు
- నేడు అంతర్జాతీయ జానపద కళల దినోత్సవం

కార్పొరేషన్(కాకినాడ),ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): జానపదకళలకు ఒకప్పుడు ఎంతో ప్రాచుర్యం ఉండేది. కాలక్రమంలో జానపదం మసకబారుతోంది. ఇవి ప్రజలనుంచి సంక్రమించిన కళారూపాలు. ఇవి సాధారణంగా ఒకప్రాంతం లేదా సంస్కృతికి ప్రత్యేకమైనవి. గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే విశిష్ట సంప్రదాయానికి సజీవ సాక్ష్యమైన జానపదకళలు కనుమరుగవుతున్నాయి. కళనే నమ్ముకున్న వేలాదిమంది కళాకారులు రోడ్డున పడుతున్నారు. కళలు వెలుగులోకి రావడంలేదు. కళాకారులకు పొట్ట గడవని దుస్థితి ఏర్పడింది. ఆధునికత, ప్రపంచీకరణ, సామాజిక మార్పులు, పాశ్చాత్య సంస్కృతి ప్రభావం కళలను దెబ్బతీశాయి. జానపదకళలు ప్రజల్లో అవగాహనతోపాటు చైతన్యం నింపేదుకు ఉపయోగపడతాయి. నేడు అంతర్జాతీయ జానపద కళల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

జానపద కళలు..

జముకుల కథ, తంబుర్ర కథ, బుర్రకథ, తోలుబొమ్మలాట, ఒగ్గు కథ, యక్షగానం, గొల్ల సుద్దులు, వీధినాటకాలు, పగటి వేషాలు, జడ కోలలు, కోలాటం జానపద కళలు అంటారు.

జమునానగర్‌లో తోలుబొమ్మలాట

ఆనాటి ప్రముఖ సినీనటి జమున కళాకారుల చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు కాకినాడరూరల్ మాధవపట్నం సమీపంలో కళాకారులకు ఒకకాలనీ నిర్మించి దానికి జమునానగర్‌గా పేరు పెట్టారు. ఇప్పటికీ అక్కడ తోలుబొమ్మలాట కళాకారులు జీవనం సాగిస్తూ తోలుబొమ్మలాటను సజీవంగా తర్వాత తరానికి కూడా అందించేలా కొత్తవారికి శిక్షణ తరగతులు నిర్వహిస్తూ ముందుకెళ్తున్నారు.

జిల్లాలో జానపద కళల స్థితి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జానపద కళాకారులు కొందరు కళనే వృత్తిగా చేసుకొని జీవనపాధి పొందుతుంటే మరికొందరు పూట గడవని స్థితిలో ఉన్నారు. ఉత్సవాలు, పండుగలు, ప్రభుత్వ కార్యక్రమాల సందర్భంలో తప్ప వీరి ప్రదర్శనలకు వీలు లేకుండా పోయింది. కొందరు పెన్షన్ అందుకుంటున్నా ఆ డబ్బులు సరిపోక గ్రామాలు తిరుగుతూ పొట్ట పోసుకుంటున్నారు.

కళలకు ప్రాధాన్యమివ్వాలి



కళలకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి. జమునసగర్‌లో తోలుబొమ్మలాటపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. ప్రభుత్వ పథకాలను ఈ తోలు బొమ్మలాటద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఇంకా సహాయం అందాలి.

-తోట పవన్‌కుమార్, గోల్డ్ మెడల్ లిస్ట్, ప్రముఖ తోలుబొమ్మలాట కళాకారుడు

కళాకారులకు న్యాయం చేయాలి



ప్రభుత్వం పేద జానపద కళాకారులను ఆదుకుని న్యాయం చేయాలి. కనుమరుగవుతున్న కళలను తర్వాత తరానికి అందించేలా చర్యలు చేపట్టాలి. కళాకారుల గుర్తింపులో ప్రభుత్వం ప్రధాన భూమి క పోషించాలి.

-పక్కి మణిబాల, జానపద కళాకారిణి

పూర్వ వైభవం తీసుకురావాలి



గతంలో కళలద్వారా జీవనపాధి పొందేవారు.ఇప్పుడు ప్రభుత్వ పథకాల ప్రచారానికి మాత్రమే ఉపయోగపడుతున్నాయి. కళలకు పూర్వ వైభవం తీసు కురావాలి. కవులు, గాయకులు, కళాకారులు ఏకం కావాలి.

-కెర్ల పుల్లారావు, నంది అవార్డు గ్రహీత, జానపద కళాకారుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స

వైసీపీ.. జగన్.. ఇదే పాట పాలన ఏముంది?

- కూటమి ప్రభుత్వంపై బొత్స విమర్శలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం 14నెలల పాలనలో వైసీపీ..జగన్.. ఇదేపాట. విమర్శలు తప్ప, పాలన, పర్యవేక్షణలేదని శాసన మండలి వైసీపీ పక్షనేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజులలో రోడ్ల గోతులన్నీ పూడ్చేస్తామని చెప్పారని, ఏ రోడ్డూ బాగోలేదని, 20శాతం రోడ్లు కూడా వేయలేదన్నారు. ఉపాధి కూలీలకు 7వారాలుగా జీతాలు ఇవ్వకపోతే, ఎలా బతుకుతారని ఆయన ప్రశ్నించారు. ఇంటింటికీ కుళాయి పనులు ఆపేశారని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని, ఐదేళ్లలో వైసీపీ పాలన, 14నెలల కూటమి పాలనలో క్రైమ్ రేట్ బేరీజ్ వేసుకుంటే ప్రజలకు అర్థం అవుతుందన్నారు. ఇదేనా మంచిపాలన. ప్రజలకు తెలియాలని, భూకబ్జాలు, దోపిడీ లు పెరిగిపోయాయన్నారు. ఏదైనా మాట్లాడితే కేసులు పెడుతు న్నారని ఆరోపించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి పీడీఎస్ బియ్యం అక్రమాలను అరికడతామని చెప్పారుకదా, ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. కూటమి నేతలు సింగపూర్ పెట్టుబడుల కోసం వెళ్లలేదని, అక్కడ పెట్టుబడులు పెట్టడానికి వెళ్లారని ఆరోపించారు. పీ4 విధానంపై ప్రభుత్వానికే స్పష్టతలేదని విమర్శించారు. ఈసమావేశంలో మాజీ ఎంపీ మార్గాని భరత్, మా జీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, తలారి వెంకట్రావు, శ్రీనివాసనాయుడు, పార్టీనేతలు గూడూరి శ్రీనివాసరావు, జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీపాదుల గ్రామోత్సవం

- పిఠాపురంలో శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం



పిఠాపురంలో శ్రీపాదశ్రీవల్లభుల వారి గ్రామోత్సవంలో పాల్గొన్న మహిళలు, ప్రత్యేక అలంకారంలో సర్వపుష్పపూజ అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులు

పిఠాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పిఠాపురంలో శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు మహాగణపతి పూజ, కలశస్థాపన, శ్రీపాద శ్రీవల్లభుల వారి మహిమాన్విత దివ్య పాద పద్మాలకు మహన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్రనామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, వేదపారాయణ, రుత్విక్కులచే దత్త మూలమంత్ర అనుష్టానము, గణపతి అధర్వ ఉపనిషత్ పారాయణ, శ్రీగురుచరిత్ర పారాయణ, శ్రీపాదశ్రీవల్లభ చరిత్ర పారాయణ నిర్వహించారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠాపన, దత్త మంత్రహోమం, శ్రీపాద శ్రీవల్లభుల వారి దివ్య పాద పద్మాలకు వివిధ హారతులు, పల్లకీ సేవ జరిగాయి. సాయంకాలార్చన, మంగళహారతి నిర్వహించారు. సర్వపుష్ప పూజ అనంతరం శ్రీపాద శ్రీవల్లభులు, దత్తాత్రేయుడు, నృసింహ సరస్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం శ్రీపాదుల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈవో ఆర్. సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టీటీడీని భ్రష్టు పట్టించిన వైసీపీ

- పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నెహ్రూ

కాకినాడసిటీ, ఆగస్టు 21(ఆంధ్ర జ్యోతి): టీటీడీని భ్రష్టుపట్టించింది వైసీపీయేనని, దేవస్థానంపై ఆపార్టీ బురద చల్లే ప్రయత్నం చేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ ధ్వజమెత్తారు. కాకినాడలోని టీడీపీజిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదు రోజులుగా వైసీపీ చేస్తున్న ఆరోపణలన్నీ పూర్తి అవాస్తవాలన్నారు. అధికారంలో ఉండగా వేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు, కల్యాణ వస్త్రాలు కుటుంబ సమేతంగా సమర్పించని జగన్మోహన్ రెడ్డి, కరుణాకరరెడ్డి టీటీడీ పవిత్రత గురించి మాట్లాడ్డం విడ్డూరంగా ఉందన్నారు. కరుణాకరరెడ్డి చైర్మన్‌గా ఉన్నప్పుడు తిరుపతిలో కారు డ్రైవర్లు దర్శనం టిక్కెట్లు అమ్మేవారన్నారు. తిరుమల లడ్డూ ఒక రోజులో పాడైపోయేదని, అన్నప్రసాదాన్ని కూడా పాలకమండలి భక్తులకు పూర్తిగా పెట్ట లేదన్నారు. ప్రొటోకాల్ తప్ప కొండపై ఎటువంటి సదుపాయాలు ఉపయోగించుకోని ప్రస్తుత చైర్మన్ బీఆర్ నాయుడువల్ల తిరుమల మసక బారుతోందని ఆరోపణలు చేస్తున్న వైసీపీ త్వర లోనే మసకబారనుందన్నారు. తిరుమల కొండ పై ఉన్నది నల్లరాయి... దానిని పూజిస్తే ఏం వస్తుందని మాట్లాడిన నాస్తికుడైన కరుణాకర రెడ్డి ఏనాడూ బొట్టు పెట్టుకోలేదన్నారు. టీటీడీ పవిత్రత గురించి మాట్లాడే నైతికత వైసీపీకి లేదన్నారు. తిరుమలలోని అన్యమత ఉద్యోగులకు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ, వేరే శాఖల్లోకి మారే అవకాశాన్ని పాలకమండలి కల్పించిందన్నారు. సామాన్య భక్తులకు రెండు, మూడు గంటల్లోనే దర్శనం కల్పించేలా సాంకేతికతను ఉపయోగించుకోనుందన్నారు. ఈ సమావేశంలో జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్‌బాబు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సభ్యుడు భూపాలపట్నం ప్రసాద్ పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామికి లక్ష రుద్రార్చన



వీరేశ్వరస్వామి సన్నిధిలో లక్ష రుద్రాక్షలు

ఐ.పోలవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసశివరాత్రిని పురస్కరించుకుని మురమళ్ల శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామికి గురువారం లక్ష రుద్రాక్ష పూజ జరిగింది. ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో 15మంది రుత్విక్కులతో లక్షరుద్రార్చన నిర్వహించారు. పుణ్యక్షేత్రం వారణాసి నుంచి తీసుకొచ్చిన రుద్రాక్షలను ఊరేగింపుగా గోదావరి తీరానికి తీసుకెళ్లి గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాక్షలకు సంప్రోక్షణ నిర్వహించారు.

గిరిజన విజ్ఞానాన్ని పరిరక్షించుకుందాం

- నన్నయ ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, గిరిజన వీరుల చిత్రప్రదర్శనను తిలకిస్తున్న వీసీ, విదేశీ అధ్యాపకులు

దివాన్‌చెరువు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గిరిజనవిజ్ఞానాన్ని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ వర్శిటీ విద్యా కళాశాల ఆధ్వర్యంలో గిరిజన ప్రాచీన విజ్ఞాన పరిరక్షణ భవిష్యత్ తరాలకు చేర్చడం అనే అంశంపై రెండురోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ గతాన్ని కాపాడుకోవడం ద్వారా భవిష్యత్ శక్తివంతంగా మారుతుందన్నారు. మన దేశీయ జ్ఞానం స్థిరమైన జీవనానికి కీలకమని చెప్పారు. స్థానిక సంఘాలను సాధికారపరచాలని, గిరిజన సంఘాలు, సాంప్రదాయ వైద్యులు, జానపద కళాకారులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. గిరిజన సంస్కృతి, విజ్ఞానం, పరిరక్షణ నుంచి సాధికారత వరకూ విశ్వవిద్యాలయాలు కృషి చేయాలన్నారు. సదస్సుకు సంబంధించిన 39 పరిశోధనపత్రాలతో ప్రచురించిన పుస్తకాలను, గిరిజన తొలి స్వాతంత్ర్య సమరయోధుల పుస్తకాలను వీసీ ఆవిష్కరించారు. విద్యాకళాశాల, రాజమహేంద్రవరం ట్రైనింగ్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన గిరిజన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. న్యూఢిల్లీలోని గిరిజన తెగల జాతీయ కమిషన్ ముద్రించిన గిరిజన స్వాతంత్ర్య సమరయోధులు, గిరిజన హక్కులు చిత్రపటాల ప్రదర్శనను ఆంధ్ర వనవాసీ కళ్యాణ శ్రమ సహకారంతో ఏర్పాటుచేశారు. దీనిని వీసీ ప్రారంభించి ఇతోపియా విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన థెసిమా గబ్రెకు ఇరాక్ నుంచి వచ్చిన బతుల్ అలీకు గిరిజన స్వాతంత్ర్యవీరులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ఏయూ నుంచి ఆచార్య వి.సుబ్రహ్మణ్యం, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం పరిపాలనాధికారి ఎస్‌వీఎస్ సూర్యనారాయణ, ఒరిస్సా కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి ఇ.అశోక్‌కుమార్, హరిశంకర్ గౌర్ కేంద్రీయ విద్యాలయం నుంచి పి.చిట్టిబాబు, పలువురు నన్నయ వర్శిటీ అధికారులు పాల్గొన్నారు.



సత్యదేవుడి దర్శనానంతరం ఎమ్మెల్సీ కల్యాణి, మాజీ మంత్రి రోజా

సత్యదేవుడి సన్నిధిలో మాజీ మంత్రి రోజా, ఎమ్మెల్సీ కల్యాణి పూజలు

అన్నవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం మాజీమంత్రి ఆర్.కె రోజా, ఎమ్మెల్సీ వరుది కల్యాణి కుటుంబసభ్యులతో స్వామి వారి వ్రతమాచరించి ప్రత్యేకపూజలు నిర్వహిచి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత లక్ష్మణరావు

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గురువారం ఒకదాత రూ. 1,01,116లు విరాళంగా సమర్పించారు. తణుకుకు చెందిన కాటూరి లక్ష్మణరావు, విజయ వెంకటలక్ష్మి దంపతులు ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శనం కల్పించారు.

ఎమ్మెల్యేతోపాటు సమానంగా భాగస్వామ్యం కల్పించాలి

- 'పిల్లి'ని బుజ్జగించిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



మాట్లాడుతున్న టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే వర్మ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనుల్లో ఎమ్మెల్యేతోపాటు సమానంగా ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కల్పిస్తేనే కేడర్, ప్రజలకు న్యాయం జరుగుతుందని, ఈవిషయంపై టీడీపీ అధిష్ఠానం నిర్దిష్ట వైఖరి చెప్పాలని పిల్లి సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. టీడీపీ కో-ఆర్డినేటర్ పదవికి ఆయన రాజీనా మా చేసిన నేపథ్యంలో అధిష్ఠానం ఆదేశం మేరకు ఆయన్ని బుజ్జగించేందుకు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ గురువారం వలసపాకలలోని నివాసంలో కలుసుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడి ఎంపికపై పార్టీ కోఆర్డినేటర్, పార్టీ పరిశీలకుల వైఖరి కారణంగా చోటు చేసుకున్న పరిణామాలు, జనసేన ఎమ్మెల్యే నుంచి టీడీపీకి ఎదురవుతున్న సహాయ నిరాకరణ వంటి విష యాలను పిల్లి సత్యనారాయణమూర్తి వివరించారు. అధికారంలో ఉండి పార్టీ కార్యకర్తలు, ప్రజలకు ఏమీ చేయలేని స్థితిలో కోఆర్డినేటర్‌గా కొనసాగడం ఇష్టంలేక ఈ పదవికి రాజీనామా చేశామ ని, క్రియాశీలక కార్యకర్తగా కొనసాగుతానని స్పష్టం చేశారు. టీడీపీలో అత్యంత సీనియర్, ఉమ్మడి జిల్లాలోనే శెట్టిబలిజ సామాజిక వర్గంలో బలమైన నాయకుడు సత్యనారాయణమూర్తి అని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ తెలిపారు. కూటమినాయకుల మధ్య కొన్ని సమస్యలు ఉండటం సహజమన్నారు. వీటి ని కూర్చుని పరిష్కరించుకుంటామన్నారు. పార్టీ అధిష్ఠానం, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీని వాసరావు, ఇన్‌చార్జి మంత్రి నారాయణల ఆదేశాలమేరకు సత్యనారాయణ తో చర్చిం చేందుకు వచ్చామన్నారు. మండలపార్టీ ఎన్నిక వాయిదా వేశామని, త్వరలో ఇద్దరు పార్టీ సీనియర్ పరిశీలకులతో పూర్తి పారదర్శకంగా కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. వారంరోజుల్లో సీఎం చంద్రబాబుతో పిల్లి దంపతులతో సమావేశమయ్యామన్నారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పార్టీపెద్దల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

గోదావరి ఉగ్రరూపం

● ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ ● రెండో ప్రమాద హెచ్చరిక దిశగా పెరుగుతున్న నీటిమట్టం
● పునరావాస కేంద్రాలకు లోతట్టు ప్రాంతాల జనం తరలింపు ● అప్రమత్తమైన యంత్రాంగం



ధవళేశ్వరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నది

గోదావరి ఉప్పొంగుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలతో ఇక్కడ ఉధృతి పెరుగుతోంది. నీటిమట్టం పెరగడంతో ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యింది. 11 లక్షలకు పైగా క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. దీంతో కోనసీమ లోని గౌతమి, వృద్ధగౌతమి, వైనతేయ, తదితర నదీపాయల్లోకి వరదనీరు వచ్చి చేరడంతో ఆత్రేయ పురం, అలమూరు, రావులపాలెం, కె.గంగవరం, అయినవిల్లి, మామిడికుదురు, పి.గన్నవరం, ముమ్మి డివరం తదితర ప్రాంతాల్లో వరద పోటెత్తింది. ముమ్మిడివరంలో కూరగాయల పంటలు, కొబ్బరితో టలు నీటమునిగాయి. పి.గన్నవరం మండలం లో కనకాయలంక కాజ్‌వే పూర్తిగా జలదిగ్బం ధంలో చిక్కుకోగా ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తు న్నారు. ఏజెన్సీలోనూ శబరి, సీలేరు నదులకు వరద పోటెత్తడంతో చింతూరు, వర రామచంద్రపురం, ఎటపాక, కూనవరం, తదితర ప్రాంతాల్లో లోతట్టు గ్రామాలు నీటమునిగాయి.

ధవళేశ్వరం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో ధవళేశ్వరం వద్ద గోదావరి అంతకంతకూ ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. బుధవారం ఉదయం నుంచి పెరుగుతున్న నీటిమట్టం గురువారం ఉదయం 6.50 గంటలకు 11.75 అడుగులకు చేరడంతో ఫ్లడ్ కంజర్వేటర్ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 9.85 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి వదిలారు. ఆపై గంటకు సరాసరి 10 వేల క్యూసెక్కులు చొప్పున ప్రవాహం పెరుగుతూ రెండో ప్రమాద హెచ్చరిక దిశగా ఉరకలేస్తోంది. గురువారం రాత్రి ఏడుగంటలకు నది నీటిమట్టం 13 అడుగులకు చేరుకోగా, 11,65, 473 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి ప్రవహిస్తోంది. రాత్రి పది గంటలకు 13,30 క్యూసెక్కులుకు చేరుకుంది. అర్ధరాత్రి దాటిన తరువాత నీటిమట్టం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి 13.75 అడుగులకు చేరుకుంటుందని అధికారుల అంచనా. ఇదే సమయంలో పరీవాహక ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరే వరద తగ్గడంతో కాళేశ్వరం, పేరూరు వద్ద నీటిమట్టం తగ్గుతుండగా, భద్రాచలం వద్ద నిలకడగా కొనసాగుతోంది. రాత్రి పది గంటలకు 52 అడు గులు తగ్గింది.

● ఎగువన భద్రాచలం వద్ద బుధవారం ఉదయం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాగా 13 గంటల వ్యవధిలో రాత్రి 10 గంటలకు నీటి మట్టం 48.10 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యింది. ఆపై క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం గురువారం సాయంత్రం 5 గంటలకు 52.10 అడుగులకు చేరుకుని నిలకడగా కొనసాగుతోంది

● ఎగువ నీటిమట్టాలు ఇవే...

ఎగువ ప్రాంతాల్లో నీటిమట్టం తగ్గుదల నమోదయ్యింది. గురువారం సాయంత్రం 6 గంటలకు కాళేశ్వరం వద్ద 10.85 మీటర్లు, పేరూరు వద్ద 16.60 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 14.14 మీటర్లు, భద్రాచలం వద్ద 52.10 అడుగులు, కూనవరం వద్ద 20.25 మీటర్లు, కుంట వద్ద 11.37 మీటర్లు, పోలవరం వద్ద 12.84 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.39 మీటర్లుగా నీటిమ ట్టం నమోదయింది.

● డెల్టా కాలువలకు 9100 క్యూసెక్కులు

డెల్టా పరిధిలో వర్షాలు తగ్గుముఖం పట్టి ఎండ తీవ్రత పెరుగుతుండటంతో వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచారు. తూర్పుడెల్టాకు 3800 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1500క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 3800 క్యూసెక్కులు చొప్పున మొత్తం 9100 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

కొవ్వూరు: నదీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ నుంచి అధికంగా వరద రావడంతో కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని స్నాన ఘట్టాలు పూర్తిగా నీట మునిగాయి. ఎగు వన భద్రాచలం, దిగువన ధవళేశ్వరం బ్యారేజీల వద్ద ప్రమాద హెచ్చరికలు దాటి నది ఉప్పొంగుతోంది. వరద మరింత పెరిగితే శుక్రవారం ఉదయానికి ప్రవాహం గోష్పాదక్షేత్రంలోకి చేరే అవకాశం ఉంది. డివిజనల్ పరిధిలో ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు.

సఖినేటిపల్లిరేవులో రాకపోకలు బంద్

అంతర్వేది: వరద ఉధృతి పెరగడంతో సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో రాకపోకలను గురువారం ఉదయం నుంచి నిలిపివేశారు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే సఖినేటిపల్లిరేవు పంట్లు, పడవలను నిలుపుదల చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. మరో పక్క ఇప్పటికే కలెక్టర్ ఆదేశాల మేరకు దిండి-చించినాడ వంతెనపై రాకపోకలు నిలుపుదలచేస్తూ సర్క్యూలర్ ఇవ్వగా, వరద నేపథ్యంలో సఖినేటిపల్లి రేవులో కూడా రాకపోకలను బంద్ చేయడంతో వెంటనే స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కలెక్టర్, పోలీసు అధికారులతో మాట్లాడి వంతెనపై ఆంక్షలు సడలించి వాహనదారులకు అనుమతిచ్చారు. దీంతో ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఏజెన్సీలోనూ అదే పరిస్థితి..



కూనవరం చుట్టూ చేరిన వరద నీరు

చింతూరు: చింతూరు వద్ద గోదావరి వరద ఉధృతి గురువారం మరింతగా పెరిగింది. భద్రాచలం వద్ద గురువారం రాత్రి ఎనిమిది గంటలకు 51.90 అడుగుల మేర ప్రవహిస్తోంది. కూనవరం వద్ద గోదావరి 47 అడుగులు, చింతూరు వద్ద శబరి నది 37 అడుగుల మేర ప్రవహిస్తోంది. దీంతో చిం తూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాల్లో ఎటుచూసినా వరద నీరే కనిపిస్తోంది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. 30వ నెంబరు జాతీయ రహదారిపై నీరు చేరడంతో అటుగా రాకపోకలు సాగించే వాహనాలు చింతూరు మండలం ఎర్రంపేట వద్ద బారులు తీరాయి. ఈమండలాల్లో నాలుగు రోజులుగా లోతట్టు వాసులు జల దిగ్బంధంలోనే ఉన్నారు. 326వ నెంబర్ జాతీయ రహదారిపై నెల్లిపాక సమీపంలో వరద నీరు వచ్చి చేరడంతో చింతూరు నుంచి భద్రాచలం వెళ్లే వాహనాలు వయా లక్ష్మీపురం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. వరద కారణంగా చింతూరు మండలంలో ఎనిమిది గ్రామాలకు, కూనవరం మండలంలోని పది గ్రామాలకు, వరరామచంద్రపురం మండలంలో 12 గ్రామాలకు, ఎటపాక మండలంలో పన్నెండు గ్రామాలకు వెళ్లే రహదారులు నీట మునిగినట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. శ్రీరామగిరి, రామవరం, జీడిగుప్ప, చిన్నమట్టపల్లి, తుమ్మిలేరు గ్రామ పంచాయతీల పరిధిలోని 28 గ్రామాలకు చెందిన ప్రజలు వరద ప్రభావాన్ని ఎదుర్కొంటున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.



గంటిపెదపూడి బూరుగులంక నదిపాయలో బోటు నుంచి విద్యార్థులను దింపుతున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రమాదకరంగా లంక గ్రామాలు

పి.గన్నవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద పోటెత్తడంతో దిగువన నదీపాయలు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. దీంతో లంకగ్రామాల్లోకి నీరు నెమ్మదిగా వచ్చి చేరు తోంది. పి.గన్నవరం మండలంలోని బూరుగులంక నదిపాయ ఉధృతంగా ప్రవహించడంతో ఐలాండ్‌పై ఉన్న ఊడి మూడిలంక, పెదపూడి లంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదకర ప్రవాహంలో నదీపాయ దాటడానికి భయాందోళనకు గురవుతున్నారు. వరదనీరు ఏటిగట్టును తాకుతూ... చెంతనే ఉన్న మినీ కాజ్‌వే పైకి చేరుతోంది. కనకాయలంక కాజ్‌వే పూర్తి జలదిగ్బంధంతో లంకగ్రామంలోని ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మానేపల్లి శివారు శివాయిలంకకి వెళ్లే రహదారిపైకి వరద వచ్చి చేరుతోంది. పల్లిపాలెంలో నెమ్మదిగా ఇళ్ల వద్దకు చేరుకుంటోంది. పశ్చిమగోదావరి జిల్లా గ్రామాలైన అనగార్లంక, పెదమల్లంక, అయోధ్యలంక వాసులు నాటుపడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు.

రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్- 2025లో

ప్రథమ బహుమతి విజేత అమలాపురం టీమ్



నగదు బహుమతిని అందుకుంటున్న అనిల్ అండ్ శ్రీ టీమ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం హోటల్ మంజీరాలో భవాని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో నిర్వహించిన రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్-2025లో 150 టీమ్‌లు వారి ఆవిష్కరణలతో హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హాజరుకాగా, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జనసేన రాజమహేంద్రవరం నగరం అధ్యక్షుడు వై. శ్రీను, తదితరులు పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌లో ప్రథమ బహుమతిని అమలాపురానికి చెందిన అనిల్ అండ్ శ్రీ టీం హెల్ప్‌టూ డిసబుల్ ప్రాజెక్టు కైవసం చేసుకుంది. ఇందుకుగాను ప్రథమ బహుమతి కింద రూ.లక్షా 75 వేలు నగదు చెక్కును ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి అందించారు. అదేవిధంగా ద్వితీయ బహుమతిని విశాఖపట్నంకు చెందిన చెన్న వైష్ణవి, శంకర్ డిటీమ్‌పేజో ప్రాజెక్టుకు కైవసం చేసుకుంది. దీనికి రూ.లక్ష నగదు చెక్కును అందించారు. అలాగే తృతీయ బహుమతికి శ్రీకాకుళంకు చెందిన సాయికిరణ్ రూపొందించిన డ్యూయల్ అలెర్ట్ సిస్టమ్ ప్రాజెక్టు కైవసం చేసుకుంది. బహుమతిగా రూ.75 వేలు నగదు చెక్కును అందించారు.

గంజాయి మత్తులోనే హత్యలు?

● పోలీసులకు లొంగిపోయిన నిందితుడు కోటేశ్వరరావు



కోటేశ్వరరావు

నల్లజర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలంలోని ఘంటవారి గూడెంలో సంచలనం సృష్టించిన దంపతుల హత్య కేసులో నిందితుడు, గంగన్నగూడెంకి చెందిన మారిదు కోటేశ్వరరావు గురువారం నల్లజర్ల పోలీసులకు లొంగిపోయాడు. గంజాయి మత్తు లోనే దారుణానికి పాల్పడినట్టు స్థానికులు పేర్కొంటున్నారు. అత్తమామలను చంపిన అనంతరం నిందితుడు తన తల్లికి ఫోన్ చేసి మాట్లాడుతూ తన అత్తమామలను నరికి చంపేశాను. మూడు నెలలు జైల్లో ఉండి వస్తాను... నువ్వు కంగారు పడొద్దని సంఘటనా స్థలం నుంచే మాట్లాడినట్టు అక్కడివారు చెబుతున్నారు. కాగా, మామ ఏకుల సుబ్బారావు, శారద మృతదేహాలకు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

మావోయిస్టులపై మరో ఏడాది ..

నిషేధం పొడిగింపు

● ప్రజా రక్షణ చట్టం మేరకు అసాంఘిక చర్యలపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
● మావోయిస్టు అనుబంధ సంఘాలు, సంస్థలపైనా ...

రంపచోడవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), దాని అనుబంధ సంఘాలు, సంస్థలపై ఇప్పటివరకూ అమలులో ఉన్న నిషేధాన్ని మరో ఏడాదిపాటు పెంచుతూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రజా రక్షణ చట్టం, 1992 ప్రకారం ఈ నిషేదాజ్ఞలను ప్రభుత్వం జారీచేసింది. 2005 ఆగస్టు 17న ప్రభుత్వం రాష్ట్రంలో తొలిసారిగా మావోయిస్టులు, వారి అనుబంధ సంఘాలు, వ్యవస్థలపై నిషేదాన్ని విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి ఏటా ఈ నిషేదాన్ని పొడిగించడం రివాజు. ఆ ప్రకారం ఈనెల 17 నుంచి మరో ఏడాది పాటు పొడిగిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. అసాంఘిక సంఘంగా మావోయిస్టు పార్టీ, విప్లవ కార్మిక సమాఖ్య, సింగరేణి కార్మిక సమాఖ్య, రాడికల్ యూత్ లీగ్, రాడికల్ స్టూడెంట్స్ యూనియన్, రైతు కూలీ సంఘం, ఆలిండియా రివల్యూషనరీ యూత్ ఫెడరేషన్, రివల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్ తదితర సంఘాలపై ఈ నిషేధాజ్ఞలు మరో ఏడాదిపాటు కొనసాగుతున్నాయి.

ఆలయాలే అతడి టార్గెట్

» పాత నేరస్థుడి అరెస్ట్
» కిలో బంగారం స్వాధీనం
» కాకినాడ ఎస్పీ బిందుమాధవ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గుళ్లు, గోపురాలే అతడి టార్గెట్. రద్దీగా ఉండే ప్రాంతాల్లో పార్కింగ్‌లో వాహనాలుంటే చాలు చేతికి పని చెప్తాడు. ఆ విధంగా గతేడాది, ఈ ఏడాది కలిపి ఐదు నేరాలకు పాల్పడ్డాడు. చివరికి అతని పాపం పండి కాకినాడ పోలీసులకు చిక్కాడు. నిందితుడి వద్ద నుంచి సుమారు కిలో బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను ఎస్పీ జి.బిందుమాధవ్ వెల్లడించారు. బుధవారం సాయంత్రం అన్నవరం కొండపై పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా ఎర్టిగా కారులో ఉన్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం మొగళ్లమూరు గ్రామానికి చెందిన 47 ఏళ్ల చింతా గణేష్‌గా నిర్ధారించారు. అతడు కారు డ్రైవర్.వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బులు సంపాదించాలని నేరాలను ప్రవృత్తిగా మార్చుకున్నాడు. 2020లో సాదాసీదాగా తన మొదటి దొంగతనాన్ని ప్రారంభించాడు. రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ చేసి ఉన్న కార్లపై దృష్టి పడింది. 2024లో అన్నవరం కొండ మీద పార్క్ చేసి ఉన్న కారు డిక్కీలో భద్రపర్చిన సుమారు 257 గ్రాముల బంగారం, తిమ్మాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కారు డిక్కీలో నుంచి సుమారు 349.44 గ్రాముల బంగారం, పశ్చిమగోదావరి జిల్లా ద్వారకా తిరుమల ఆలయం వద్ద కారు డిక్కీలో నుంచి సుమారు 183 గ్రాముల బంగారం అపహరించాడు. 2025లో తిమ్మాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆగి ఉన్న కారు డిక్కీలో నుంచి సుమారు 155 గ్రాముల బంగారం తస్కరించాడు.బుధవారం అన్నవరం దేవస్థానం కొండపై పెళ్లిళ్లు ఎక్కువగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పడిన రద్దీతో కారు డిక్కీలో నుంచి సుమారు 45 గ్రాముల బంగారాన్ని దొంగిలించి కారులో పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా సీఐ సూర్యఅప్పారావు ఆధ్వర్యంలో ఎస్ఐలు శ్రీహరిబాబు, ప్రసాద్‌లు.. సిబ్బందితో గణేష్‌ను పట్టుకున్నారు. అతడిపై అన్నవరంలో 2, తిమ్మాపురంలో 2,ద్వారకా తిరమలలో ఒక కేసు ఉన్నాయని, ఈ కేసుల్లో నిందితుడి నుంచి 989.44 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ పేర్కొన్నారు. నిందితుడ్ని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ సూర్యఅప్పారావు,ఎస్ఐలు శ్రీహరిబాబు, ప్రసాద్, సాంకేతికతను అందించిన ఐటీ కోర్ టీమ్ సీఐ డి.దుర్గాశేఖర్‌రెడ్డి,వారి సిబ్బందికి ఎస్పీ నగదు ప్రోత్సాహకాలు అందజేసి అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం

టిక్కెట్ల జారీలో గందరగోళం

» నేడు పిఠాపురం పాదగయలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు
» తోపులాటలో భక్తురాలికి గాయాలు
» ఉదయం నుంచి భక్తుల పడిగాపులు
» నేతలను నిలదీసిన మహిళలు





టిక్కెట్ల కోసం నిరీక్షిస్తున్న మహిళలు, గాయపడిన మహిళ

పిఠాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరగనున్నాయి. వ్రతాల్లో పాల్గొనే మహిళలకు అందించేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పది వేల చీరలు, పసుపు, కుంకుమ సమకూర్చారు. పూజా సామగ్రిని సిద్ధం చేశారు. ఏర్పాట్లను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షించారు. గురువారం మధ్యాహ్నం, సాయంత్రం రెండు విడతలుగా మహిళలకు టిక్కెట్లు జారీ చేశారు. కాగా ఈ ప్రక్రియ గందరగోళంగా మారింది. ఏర్పాట్ల విషయంలో ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో వ్యవహరించడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టిక్కెట్లు ఎప్పుడు జారీ చేస్తారో స్పష్టంగా తెలపకపోవడంతో పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు తెల్లవారు జాము నుంచే పాదగయకు తరలివచ్చి క్యూలైన్లలో బారులుదీరారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో టిక్కెట్ల జారీ ప్రారంభించారు. సగం మందికి టిక్కెట్లు పంపిణీ చేసి అయిపోయాయని చెప్పడంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఈ ఘటనలో పద్మావతి అనే మహిళకు గాయాలు కాగా పలువురు కిందపడిపోయారు. పది వేల మందికి వ్రతాలు అని చెప్పి టిక్కెట్లు లేవని చెప్పడం ఏమిటంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాదగయ ఆవరణలోనే ఉండిపోయారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబును చుట్టుముట్టారు. ఇతర నాయకులను నిలదీశారు. తుమ్మల బాబు అప్పటికప్పుడు టిక్కెట్లు తెప్పించి పంపిణీ చేశారు. మొత్తం ఈ వ్యవహారంలో జనసేన నాయకులు, దేవదాయ, పోలీసు శాఖల అధికారుల మధ్య సమన్వయలోపం కనిపించింది.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు

ఏసీబీకి చిక్కిన ఏలేశ్వరం మున్సిపల్ కమిషనర్



కమిషనర్ సత్యనారాయణ, అరుణాచలం

ఏలేశ్వరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అవినీతి నిరోధకశాఖ అధికారులు గురువారం ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ ఎం.సత్యనారాయణను అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అరుణాచలంపై కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు ఏసీబీ డీఎస్పీ కిషోర్‌కుమార్ గురువారం వెల్లడించారు. నాలుగేళ్ల క్రితం పట్టణంలో కృష్ణాలయం వీధిలో అర్బన్ హెల్త్ ప్రైమరీ క్లినిక్‌ను, 2017లో సీసీ రోడ్లను కాంట్రాక్టర్ టి.రాజబాబు నిర్మించారు. ఈ పనులకు సంబంధించి రూ.8.05 లక్షలు కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సి ఉంది. ఈ బిల్లులు మంజూరు చేయాలంటే 3శాతం కమీషన్ ఇవ్వాలని కమిషనర్ డిమాండ్ చేశాడు. రూ.23 వేలకు ఒప్పందం కుదిరింది. ఆ సొమ్మును ఇవ్వడం ఇష్టం లేని రాజబాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సదరు సొమ్మును డేటా ఎంట్రీ ఆపరేటర్ (అవుట్ సోర్సింగ్) అరుణాచలానికి అతడి నివాసం వద్ద రాజబాబు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా కమిషనర్ కోరిక మేరకు నగదు తీసుకున్న నేపథ్యంలో ఇద్దరిపై కేసు నమోదు చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నామని డీఎస్పీ కిషోర్‌కుమార్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కాకినాడ రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం శ్రీనివాసానగర్ నాల్గవ వీధిలో పాడుపడి శిథిలావస్థకు చేరిన ఇంటి విద్యుత్ వైర్లు తగిలి వర్షపు నీటిలో సుమారు 35 ఏళ్ల పురుషుడి మృతదేహం కుళ్లిన స్థితిలో లభ్యమైందని ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు.వీఆర్వో ఇచ్చిన రిపోర్టు ఆధారంగా కేసు నమోదు చేశామని,సదరు వ్యక్తి చెత్త ఏరుకుంటూ ఆ ఇంటి లోపలికి ప్రవేశించి విద్యుత్ వైర్లు తగిలి మరణించి ఉంటాడని అనుమానిస్తున్నామన్నారు. మృతదేహం గుర్తుపట్టడానికి వీలులేకుండా కుళ్లి ఉందన్నారు.దేహంపై ఎరుపు రంగు పొడవాటి చేతుల టీషర్ట్, బూడిద రంగు ఫ్యాంటు ఉన్నాయన్నారు. ఎవరికైనా ఆ వ్యక్తి ఆచూకీ తెలిస్తే ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌కు లేదా 0884 -2363037 నెంబరుకు సమాచారమివ్వాలని సూచించారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

బిక్కవోలు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు-ఊలపల్లి రోడ్డులో గురువారం మధ్యాహ్నం ఆటో ఢీకొని ఊలపల్లికి చెందిన రెడ్డి సూర్యభాస్కరరావు(34) మృతి చెందాడు. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ వివరాల ప్రకారం.. సూర్యభాస్కరరావు ఉదయం ఊలపల్లి, బిక్కవోలు గ్రామాల మధ్యలో వున్న తన పొలానికి వెళ్లి పశువులకు గడ్డి కోసుకుని గ్లామర్ బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఊలపల్లి నుంచి బిక్కవోలు వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో సూర్యభాస్కరరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవిచంద్రకుమార్ పేర్కొన్నారు.

డ్రైన్‌లో వ్యక్తి మృతదేహం

మండపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండపేట బైపాస్ రోడ్డులోని డ్రైన్‌లో ఓ మృతదేహాన్ని స్థానికులు గురువారం గుర్తించారు. వారి సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కాగా మృతుడు మండపేటకు చెందిన ఉప్పాడ అశోక్‌గా గుర్తించామని ఎస్ఐ రాము తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ముగ్గురు ఇంజనీర్లకు షోకాజ్‌లు జారీ

» పోలవరం పునరావాస కాలనీల్లో అక్రమాలపై ప్రభుత్వ కొరడా
» విజిలెన్సు విచారణలో నాణ్యతా లోపాల గుర్తింపు

రంపచోడవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పోలవరం జాతీయ ప్రాజెక్టులో గిరిజన నిర్వాసితుల పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పన చర్యల్లో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రంపచోడవరం గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం ద్వారా దేవీపట్నం, కూనవరం, వీఆర్ పురం మండలాల్లో చేపట్టిన పనులన్నిటిపైనా జరిగిన విజిలెన్సు విచారణలో అనేక అక్రమాలు వెలుగు చూశాయి. నాణ్యతా ప్రమాణాలు లేకుండా ఆయా కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు చెల్లింపు జరిగేలా సిఫార్సు చేసిన అప్పటి ఇంజనీర్లపై చర్యలను చేపట్టింది. ఈ మేరకు ముగ్గురు ఇంజనీర్లపై శాఖాపరమైన చర్యలకు ప్రభుత్వం గురువారం నాలుగు వేర్వేరు ఉత్తర్వులను జారీ చేసింది. దేవీపట్నం మండలంలోని నేరేడువలస, ముసళ్లకుంట, కంబలంపాలెం, పోలవరం పునరావాస కాలనీల్లో 465 మంది నిర్వాసితుల కోసం సుమారు రూ.53 కోట్లతో చేపట్టిన అంతర్గత రోడ్లు, భవనాలు, డ్రైనేజీల నిర్మాణాల్లో నాణ్యతాలోపాలతో పనులు జరిగాయి. వీటిపై జరిగిన విజిలెన్సు తనిఖీల్లో లోపాలు బయటపడ్డాయి.పలు పనుల్లో నాణ్యతా లోపాలు జరిగి ఆయా బిల్లుల చెల్లింపునకు అనర్హంగా ఉన్నా వాటి చెల్లింపునకు అప్పటి ఈఈలు పి.రమాదేవి, జి.డేవిడ్ రాజు, డీఈఈ ఐ.శ్రీనివాసరావు సిఫార్సులు చేశారు. తదుపరి ఆయా లోపాలను సరిచేయడం ద్వారా ప్రభుత్వంపై అదనపు భారం పడింది.తద్వారా నిధుల దుర్వినియోగానికి ఆయా ఇంజనీర్లు కారణమయ్యారు.ఈ అంశాలను గుర్తించిన విజిలెన్సు అధికార్లు ప్రభుత్వానికి నివేదిక సమర్పించడంతో ఆయా కాలనీల వారీగా ప్రభుత్వం చర్యలను చేపట్టింది. ఇందులో భాగంగానే ఈ ముగ్గురు ఇంజనీర్లపై శాఖాపరమైన చర్యలను చేపట్టి వారి నుంచి సంజాయిషీ కోరింది. ప్రభుత్వం జరిపే విచారణ అనంతరం బాధ్యులపై క్రమశిక్షణా చర్యలు ఉంటాయి.

4వేల కిలోల బెల్లంతో మినీ వ్యాన్ సీజ్

ప్రత్తిపాడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు నల్లబెల్లం లోడుతో వెళుతున్న వ్యాన్‌ను సీజ్ చేశారు. ఎక్సైజ్ ప్రత్తిపాడు సీఐ పి.శివప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్తిపాడు సమీపంలోని యర్రవరం జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనకాపల్లి నుంచి మినీ వ్యాన్‌లో 4వేల కిలోల నల్లబెల్లం రవాణా చేస్తుండడాన్ని గుర్తించారు. ఈ వ్యాన్ అనకాపల్లి నుంచి యర్రవరం వచ్చి అక్కడ నుంచి ఏలేశ్వరం మండల గ్రామాల వైపు వెళుతుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. నల్లబెల్లాన్ని, వ్యాన్‌ను సీజ్ చేసి లింగంపర్తికి చెందిన మనం నాగరాజును అరెస్ట్ చేశారు. బెల్లాన్ని పురమాయించిన గెద్దనపల్లికి చెందిన చిలపరశెట్టి వెంకటరమణపై కేసు నమోదు చేశారు.

విద్యలో అనేక నూతన సంస్కరణలు: గోరంట్ల



సరస్వతి దేవి విగ్రహం వద్ద విద్యార్థులతో గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్ 21(ఆంధ్రజ్యోతి) విద్యలో అనేక నూతన సంస్కరణలు తీసుకొచ్చి ప్రభుత్వం విద్యార్థుల అభ్యున్నతికి కృషిచేస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు.మండలంలోని కొంతమూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జి.మేడపాడు గ్రామానికి చెందిన సుంకవల్లి ఆదిత్య భార్గవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. విద్య అందరికి అవసరమైందని, పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషితో పాటు ప్రైవేటు రంగాల వారు ముందుకు రావాలన్నారు. విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని, మంచి అలవాట్లు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిన్నమరెడ్డి ఈశ్వరుడు, తాడేపల్లి నాగరాజు, దండమూడి తేజా, అంగర రాజు కూటమి నాయకులు పాల్గొన్నారు

'చలో విశాఖ'ను విజయవంతం చేయండి

రాజానగరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 30న విశాపట్నంలో జరిగే విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం(చలో విశాఖ) కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జనసేన పార్టీ నాసేన కోసం నావంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. రాజానగరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడు తూ ఆ రోజు మధ్యాహ్నం 3గంటలకు విశాఖపట్నంలోని ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ గ్రౌండ్స్‌లో జరిగే ఈ సమావేశంలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పాల్గొంటారన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు అధిక సంఖలో వెళ్లి విజయవంతం చేయాలని వెంకటలక్ష్మి కోరారు.

పింఛన్ల నిలుపుదలపై అసత్య ప్రచారాలు నమ్మొద్దు



రాజానగరంలో ఎంపీడీవోలతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

ఎమ్మెల్యే బలరామకృష్ణ

రాజానగరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పింఛన్ల నిలుపుదలపై వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్పష్టం చేశారు. నియోజవర్గం కేంద్రమైన రాజానగరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మూడు మండలాల ఎంపీడీవోలతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా చూడాలన్నారు. 18 ఏళ్లలోపు ఉన్న మానసిక దివ్యాంగత్వం (ఎంఆర్), మాన సిక అనారోగ్యం(ఎంఐ) కేటగిరీల కింద తాత్కాలిక వైద్య ధ్రువపత్రం జారీ చేసిన వారికి యథావిధిగా పింఛన్ అందజేస్తామన్నారు. పింఛన్లు తొలగించిన లేదా అర్హులైన వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్నా సంబంధిత సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు/పునఃపరిశీలన చేసుకోవాలన్నారు. ఎంపీడీవోలు జేప ఝాన్సీ, ఎం.భారతి, ఈ.మహేశ్వరప్రతాప్(ఇన్‌చార్జి), మండల పరిషత్ ఏవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, నాసేన కోసం నావంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

వరి పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

రాజమహేంద్రవరం రూరల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావం వివిధ దశలలో వున్న వరి పంటలను పరిశీలించేందుకు జిల్లా ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా నరశింహరావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ మండలంలోని తొర్రేడు, వెంకటనగరం, కోలమూరు గ్రామాలను వ్యవసాయాధికారులు భీమరాజు, జాన్ పీటర్‌లతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ప్రస్తుతం వర్షపాతం సాధారణ స్థితిలోనే వుందని కొన్ని లోతట్టు ప్రాంతాలు జల్లు కాలువలో పూడిక తీయకపోవడంతో ముంపుకు గురైందని, అదనపు నీరు బయటకు పోయే అవకాశం వుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదనాన్నరు. వరి పిలకల దశలో మునిగితే సాధారణ రకాలు 5 రోజుల వరకు ముంపుకు తట్టుకుంటాయన్నారు. పిలకలు కట్టే దశలో నీట మునిగిన వరి పొలాలు త్వరగా పుంజుకోవడానికి వీలైనంత వెంటనే నీటిని తీసివేసి ఎకరానికి 20 కిలోల యూరియాను, 10నుంచి 15 కిలోల పొటాష్‌ను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు సుంకవల్లి వెంకటగిరి, చిట్టూరి సర్వారాయుడు, దుర్గారావు, వీఏఏలు శ్రీనివాస్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవగాహన దినోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎస్.ఉదయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులకు వ్యాపార మెళకువలు, స్టార్టప్స్, ఇన్నోవేటివ్ ఆలోచనలు, కొత్త ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగడం ఎలా తదితర విషయాలపై సమగ్ర అవగాహన కల్పించారు. మరో రిసోర్సుపర్సన్ సీహెచ్ఎస్‌జీఎస్ ప్రసాద్‌రెడ్డి(సీపీ రెడ్డి ఆటోమొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్) విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం, వైస్ ప్రిన్సిపాల్ అండ్ ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ వై.స్వర్ణశ్రీ, అకడమిక్ కో ఆర్డినేటర్ జి.శరత్‌బాబు, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఇన్‌ఛార్జి కేవీ విశ్వేశ్వరరావు, కె.నీలకంఠేశ్వరరావు, సీహెచ్ కుసుమ గాంధీ, కేబీఆర్ అంబేడ్కర్ పాల్గొన్నారు.

'సారథ్యం'ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 1న రాజమహేంద్రవరంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే సారథ్యం సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. గురువారం స్థానిక చిర్ల తిలక్ రెడ్డి వర్తక సంఘ కళ్యాణ మండపంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బీజేపీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సారథ్యం కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకోవాలన్నారు. నియోజకవర్గం నుంచి సుమారు ఐదు వేల మంది పాల్గొనేలా కృషి చేయాలన్నారు. అనంతరం నాలుగు మండలాల నుంచి పరిశీలకులుగా వచ్చిన హారిర కాశీ, అనురాధలతో ఎమ్మెల్యే కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షులు కర్రి బులిరెడ్డి, సాయిరామ్, దుర్గారెడ్డి, శివ నాలుగు మండలాల కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అక్షర దేవతల ఊరేగింపు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తెలుగు పలుకులోని వర్ణమాల అంతర్నిర్మాణం వాగ్దేవతలకు అనుసంధానమై ఉంటుందని కాలభైరవ గురుసంస్థాన అధిపతి శివస్వామి అన్నారు. తెలుగు మాటల పండుగలో భాగంగా తొలిరోజైన గురువారం అక్షర దేవతల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలోని నన్నయ విగ్రహం నుంచి పుష్కరాలరేవు రాజరాజ నరేంద్రుని విగ్రహం వరకూ అక్షర దేవతల చిత్రాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శివస్వామి మాట్లాడుతూ పలుకులో ఉన్న ప్రతి వర్ణాలకు ఒక రూపం, దేవత శక్తి ఉంటుందన్నారు. చంద్ర ఖండం, అగ్ని ఖండం, సౌర ఖండం అనే పేర్లతో అధిష్టాన దేవతలు కొలువై ఉంటారని అన్నారు. ప్రధాన వక్త జయప్రద మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వాళ్లంతా ఆ శబ్దానికి ఉన్న గౌరవాన్ని గుర్తెరగాలని అన్నారు. వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, సప్పా దుర్గాప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి వీవీబీ సంజీవరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పీవీఎస్ కృష్ణారావు, సన్నిధానం శాస్త్రి, బలరామనాయుడు, ఇజ్జిన వినోద్‌కుమార్, తోట రామకృష్ణ, టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

రంగంపేట సొసైటీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఆళ్ల గోవిందు

రంగంపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం జరిగింది. దీనికి టీడీపీ జిల్లా కార్యదర్శి ఆళ్ల గోవిందు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. రైతు శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులకు అందుబాటులో విత్తనాలు ఎరువులు, క్రిమిసంహారక మందులు తదితర సామగ్రి సకాలంలో అందించడానికి కార్యవర్గం సన్నద్ధం ఉండాలన్నారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్‌గా గారపాటి రాంబాబు, సభ్యులుగా బోడెం రాంబాబు, దూబాసి వరప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఎం.సాయిరామ్, నాయకులు మండవిల్లి గుప్త, పోతుల వీరసుందరరావు,పోతుల వెంకటరాజు,బలిరెడ్డి దుర్గారావు, ఉండవిల్లి బాబూరావు, పోతుల చిన్నికాపు పాల్గొన్నారు.

బిక్కవోలులో పశువైద్య శిబిరం

బిక్కవోలు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు పశువైద్యశాల ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని సొసైటీ ఛైర్మన్ పాలచర్ల వెంకటశివప్రసాద్‌చౌదరితో కలసి ఎంపీపీ తేతలి సుమ ప్రారంభించారు. శిబిరంలో 55 పశువులకు గర్భకోశ, గర్భ నిర్ధారణ, ఇతర వ్యాధులకు చికిత్సలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు.

డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలి





అన్న క్యాంటీన్‌ను, హోమియో వైద్యశాలను తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ ప్రశాంతి

» ఇన్‌చార్జి కమిషనర్ ప్రశాంతి
» నగరంలో అన్న క్యాంటీన్, హోమియో వైద్యశాల తనిఖీ

రాజమహేంద్రవరం సిటీ/అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్లు ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉండాలని, అవసరమైన మందులు తక్షణమే అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి సూచించారు. స్థానిక సుబ్రహ్మణ్య మైదానంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను, ఆల్‌కట్ గార్డెన్స్ వద్ద ఉన్న నగరపాలక సంస్థ హోమియో వైద్యశాలను ఆమె గురువారం తనిఖీ చేశారు. ఉదయం హోమియో వైద్యశాలను కలెక్టర్ తనిఖీ చేసి ఓపీ సేవలను, మందుల నిల్వలు, అక్కడ అందుతున్న వైద్యసేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్ర ఆవరణం ఎల్లప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు, వాతావరణంలో మార్పులు, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు ఆసు పత్రిలో సిద్ధంగా ఉంచాలని సూచించారు. సీజనల్, ఇతర వ్యాధులు వ్యాప్తి నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యులకు కలెక్టర్ సూచించారు. అనంతరం స్థానిక సుబ్రహ్మణ్య మైదానంలో ఉన్న అన్నక్యాంటీన్‌కు వెళ్లి ఆహార నాణ్యతపై ప్రజలతో మాట్లాడి వివరాలు అడిగారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లో పేదల కోసం అందించే ఆహారం నాణ్యతలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా రుచిగా శుచిగా ఉండాలని సూచించారు. భోజన పదార్థాలు మెనూ ప్రకారం ఉండేలా చూడాలన్నారు. సమయ పాలన తప్పనిసరి అని నిర్వాహకులకు, సిబ్బందికి చెప్పారు. క్యాంటీన్‌లో స్వచ్ఛత, టోకెన్ కౌంటర్, డైనింగ్ ఏరియా, చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశం, టాయిలెట్లు తదితర సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. ఆర్వో వాటర్ ఫిల్టర్‌ను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని సూచించారు. క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలు అన్న క్యాంటిన్‌లో భోజన నాణ్యత ఇతర అంశాలపై అభిప్రాయాలు తెలియజేయవచ్చని చెప్పారు. ప్రతి రోజు అన్న క్యాంటిన్లను పరిశీలించి అక్కడ ఉన్న సమస్యలు, మరమ్మతులు గుర్తించి వాటిని చేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



సీతానగరంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

» ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలి
» సమస్యల పరిష్కారం కోరుతూ పలుచోట్ల అంగన్‌వాడీల ఆందోళన

రాజానగరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనం రూ26 వేలు ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు నినదించారు. న్యాయపరమైన తమ డిమాండ్ల సాధన కోరుతూ ఏపీ అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు గురువారం పలుచోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రాజానగరంలో అంగన్‌వాడీ కేంద్రాల పనివేళలు ముగిసిన అనంతరం సాయంత్రం నల్ల చీరలు ధరించి స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకుని నినాదాలు చేస్తూ ర్యాలీగా స్థానిక సాయిబాబా ఆలయం,బస్టాండ్ మీదుగా గాంధీ బొమ్మ సెంటర్‌కు చేరుకుని మానవహారం ఏర్పాటు చేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ తమకు కనీసం వేతనం ఇవ్వాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని అన్నారు. తమ డిమాండ్లు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు, ఎం.మార్తమ్మ, పి.సుబ్బలక్ష్మి, పుణ్యక్షేత్రం, దివాన్‌చెరువు, కలవచర్ల, రాజానగరం సెక్టార్ల అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

అనపర్తి: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నలుపు రంగు దుస్తులు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ప్రభుత్వాలు హామీలివ్వడమే తప్ప అమలు చేయడం లేదన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమకు ఇచ్చిన ఫోన్లలో యాప్‌లు పనిచేయక ఇబ్బందులు పడుతున్నామని ట్యాబులు ఇచ్చి 5జి నెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

సీతానగరం: మండలంలోని అంగన్వాడీ వర్కర్స్ వెల్ఫేర్ యూనియన్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద మండలాధ్యక్షురాలు సువర్ణకుమారి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఎ.శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. సువర్ణకుమారి మాట్లాడుతూ 2014 నుంచి తమకు వేతనాలు పెంచలేదన్నారు. తక్షణమే పెంచాలని, సరుకుల పంపిణీలో ఓటీపీ, ఎఫ్ఆర్ఎస్ నిబంధనలు రద్దు, గ్రాట్యుటీ జీవోలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో భారతిని కలసి 1వ తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నుంచి తమను తప్పించాలని వినతిపత్రం సమర్పించారు.

రాజమహేంద్రవరం అర్బన్: స్థానిక వై.జంక్షన్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో రాజమహేంద్రవరం ప్రాజెక్టు నాయకురాలు శారద మాట్లాడుతూ 42 రోజుల సమ్మె సందర్భంగా 2024 జులైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారని, నేటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం దాన్ని పట్టించుకోవడంలేదన్నారు. అంగన్వాడీ యూనియన్లను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ పాల్గొని మద్దతు తెలిపారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు రామలక్ష్మి, సునీత, మున్ని, మరియ తదితరులు పాల్గొన్నారు.



రాజానగరంలో మానవహారంగా నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



అనపర్తి సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ విద్య

» ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలి
» ఈస్ట్‌జోన్ డీఎస్పీ విద్య
» వినాయక చవితి ఉత్సవ కమిటీల ప్రతినిధులతో సమావేశాలు

అనపర్తి/బిక్కవోలు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల నిర్వహణలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య అన్నారు. అనపర్తి సర్కిల్ కార్యాలయంలోను, బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయంలోను వినాయక చవితి ఉత్సవ కమిటీ ప్రతినిధులతో గురువారం వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద నిబంధనల ఉల్లంఘన జరిగితే వచ్చే ఏడాది అక్కడి మండపాలకు అనుమతులు ఉండవని, దీనిని దృష్టిలో ఉంచుకుని నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా దర్శనాలు కల్పించాలన్నారు. రాత్రి 8గంటల వరకే మైక్‌లకు అనుమతి ఉంటుందని డీజేలు పూర్తిగా నిషేధమన్నారు. మండపాల్లో విద్యుద్దీపాల నుంచి హుండీల వరకు పర్యవేక్షణ కమిటీలదేనన్నారు. నిమజ్జనం సందర్భంగా కమిటీలు ముందుగానే నిమజ్జన ప్రదేశం, రోడ్డు మ్యాప్ తమకు తెలియజేయాలలన్నారు. మద్యం తాగిన వారిని నిమజ్జనాలకు దూరంగా ఉంచాలని డీఎస్పీ స్పష్టం చేశారు. సమావేశాల్లో అనపర్తిలో సీఐ సుమంత్, ఎస్ఐ శ్రీనునాయక్, ట్రైనీ ఎస్ఐ సుజాత పాల్గొనగా బిక్కవోలులో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి,పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, ఎస్ఐ రవిచంద్రకుమార్, ట్రైనీ ఎస్ఐ రవీంద్రబాబు, ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేట పోలీస్‌స్టేషన్ వద్ద మండలంలోని అన్ని గ్రామాల వినాయక చవితి కమిటీ మెంబర్లతో ఎస్ఐ ఎస్.శివప్రసాద్ సమావేశం ఏర్పాటు చేశారు.గ్రామాల్లోని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని, ఐదడుగులకు మించ కూడదన్నారు. ఉత్సవాల్లో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. అశ్లీల నృత్యాలు పెట్టరాదన్నారు. నిమజ్జనం సమయంలో చిన్నపిల్లలను చెరువుల వద్దకు రాకుండా చూడాలన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు వైద్య శిబిరాలు

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ కొవ్వూరు డివిజన్‌లోని చాగల్లు మండలం మద్దూరులంక గ్రామంలో, మార్కొండపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జీపీవో సెంటర్‌లో, నిడదవోలు మండలం తాళ్లపాలెంలో, సమిశ్రగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పాత జీపీవో సెంటర్‌లో, నిడదవోలు మండలం శెట్టిపేట గ్రామంలో, సమిశ్రగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో, నిడదవోలు మండలం రావిమెట్ల గ్రామంలో, సమిశ్రగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జీపీవో సెంటర్‌లో ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండి వరద ప్రభావిత ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, అవసరమైన మందులు అందజేయడం, వ్యాధుల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నట్టు డీఎంహెచ్‌వో పేర్కొన్నారు.

మానవ హక్కులను కాపాడేందుకు కృషి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మానవ హక్కులు కాపాడేందుకు కృషి చేస్తున్నామని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ చైర్మన్ తాళ్లూరి ప్రసన్నకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాలులో గురువారం జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సుకు ఆయన ముఖ్యవక్తగా విచ్చేసి మాట్లాడారు. ప్రతినెలా ఒక జిల్లాలో మానవ హక్కులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. హక్కులు కోల్పోయిన వారికి అండగా ఉంటామని అవసరమైతే ఉచిత న్యాయసహాయం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం ఉభయ తెలుగు రాష్ట్రాల మహిళా చైర్‌పర్సన్ ఖండవల్లి లక్ష్మి, రీజనల్ చైర్మన్ పులి శ్రీనివాసరావు, రాష్ట్ర చైర్మన్ వైవీ జగన్నాథరావు, డైరెక్టర్ డాక్టర్ గిరిబాబు పాల్గొన్నారు.

'తనకాల' దంపతులకు ఘనస్వాగతం

కోరుకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగపట్నం గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు తన వ్యక్తిగత విదేశీ పర్యటన ముగించుకుని స్వగ్రామం చేరుకున్న సందర్భంగా నాగేశ్వరరావు దంపతులను గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చవితి నేపథ్యంలో ఘాట్ల పరిశీలన

రాజమహేంద్రవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నిర్వహణలో భాగంగా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు వివిధ రేవులను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘనలకు తావులేకుండా జరిగడానికి ఆయా పోలీస్‌స్టేషన్ల సీఐలతో చర్చించారు.మండపాల ఏర్పాటు,విగ్రహాల నిమజ్జన ప్రదేశాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు మురళీ కృష్ణ, సుబ్బరాజు, చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చలో కలెక్టరేట్'ను జయప్రదం చేయండి

రంగంపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 25న నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.దివ్య, టి.పవన్‌కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం కళాశాలలో పోస్టర్‌ను విడుదల చేశారు. రంగంపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, మెస్ చార్జీలు పెంచాలని తదితర డిమాండ్స్‌తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

'అర్హులైన దివ్యాంగుల పింఛన్ల తొలగింపు సరికాదు'

దివాన్‌చెరువు, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి) అర్హులైన దివ్యాంగుల పింఛన్లను రద్దుచేయడం సరికాదని డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు యాళ్ల మాచరయ్య అన్నారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ కొత్తతుంగపాడు గ్రామంలో 13 మంది దివ్యాంగుల పింఛన్లు రద్దుపరుస్తూ అధికార్లు నోటీసులు ఇవ్వగా వారిలో నలుగురివి మాత్రం వృద్ధాప్య పింఛన్‌లుగా మార్పు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం మరోసారి పరిశీలన చేసి అర్హత గలిగిన దివ్యాంగులందరికీ పింఛనులు కొనసాగించాలని ప్రభుత్వాన్ని మాచరయ్య కోరారు.

ఉమాపార్వతి నర్సరీని సందర్శించిన మాజీ మంత్రి పేర్ని నాని

కడియం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బుర్రిలంక కొత్తపల్లి శివాజీ, మూర్తి బ్రదర్స్ - ఉమాపార్వతి నర్సరీని గురువారం మాజీ మంత్రి పేర్ని నాని సందర్శించారు. నర్సరీలో ఉన్న వందేళ్ల మొక్కలను చూశారు. మొక్కల వివరాలను నర్సరీ రైతులు వివరించారు. కడియం నర్సరీలను సందర్శించడం ఆనందంగా ఉందని నాని అన్నారు.

మానవ హక్కుల అవినీతి నిరోధక సంఘం జిల్లా కన్వీనర్‌గా కిరణ్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మానవ హక్కులు, అవినీతి నిరోధక సంఘం జిల్లా కన్వీనర్‌గా కొరుమిల్లి కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం సంఘం జాతీయ అధ్యక్షుడు గుండారెడ్డి మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్ బి.వెంకటేశ్వర్లు, జాతీయ జనరల్ సెక్రటరీ దొడ్డా తిరుపతయ్యల నుంచి నియమపత్రాన్ని కిరణ్‌కుమార్ అందుకున్నారు.కార్యక్రమంలో జిల్లా హ్యూమన్ రైట్స్ చైర్మన్ తుపాకుల వెంకన్నబాబు, పిల్లి కాంతారావు, ప్రసాదం, శివన్నారాయణ పాల్గొన్నారు.

వివాహితపై కట్నం వేధింపులు

బిక్కవోలు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మెళ్లూరుకు చెందిన గళ్ల గంగాభవానిని అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్త, మామలపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ గురువారం తెలిపారు. గంగాభవానికి 15 యేళ్ల క్రితం గండేపల్లి మండలం సూరంపాలేనికి చెందిన గళ్ల వీరవెంకటసత్యనారాయణతో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె వుంది. నాలుగేళ్ల నుంచి సత్యనారాయణ రోజు మద్యం తాగొచ్చి భార్యను మానసికంగాను, శారీరకంగాను హింసిస్తున్నాడని, దీనికి అత్త, మామలు సహకరిస్తున్నారని తమకు ఫిర్యాదు చేసిందన్నారు. దీంతో భర్త, అత్త దుర్గ, మామ భగవాన్‌లపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

విద్యుత్ స్తంభం పడి వ్యక్తి మృతి

గోకవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ పవన్‌కుమార్ కథనం ప్రకారం.. కోరుకొండ మండలం కాపవరం గ్రామానికి చెందిన గొట్టాల శివ(36), మరి కొంతమంది మండలంలోని పెంటపల్లి గ్రామంలోని ఓ ఇటుక బట్టీ నుంచి ట్రాక్టర్‌పై ఇటుకల లోడు వేసుకొని తిరుమలాయపాలెం వెళ్లారు. అక్కడ లోడు దించి తిరిగి వస్తుండగా రంపయర్రంపాలెం గ్రామ శివారున డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి ట్రక్కులో కూర్చున్న శివపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

కడియం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కడియం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జిల్లా సైబర్ పోలీసులు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్‌నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు రోజురోజుకీ పెరిగి పోతున్నాయని, తక్కువ పెట్టుబడితో ఈజీగా మనీ సంపాదించవచ్చని అత్యాశకు పోయి సైబర్‌నేరగాళ్ల వలలో చిక్కుకుని డబ్బులు పోగొట్టుకుంటున్నారన్నారు. వాట్సాప్, పేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో చాటింగ్ చేయవద్దని, యాప్‌లు, లింకులు, ఈ మెయిల్స్‌తో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అనవసరమైన లింక్‌లు క్లిక్ చేయడం వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. సైబర్ నేరాలకు గురైనపుడు 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సైబర్ లాబ్ సిబ్బంది వైవీ సురేష్, డి.మహేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు..

కొలువుదీరిన కొవ్వూరు ఏఎంసీ పాలకవర్గం 8

కేబినెట్ 'వరాలు'



- పుష్కర ఎత్తిపోతల పథకం పైపులైన్ల మార్పునకు ఆమోదముద్ర
- రూ.51.67 కోట్లతో పరిపాలన ఆమోదం ఇచ్చే ప్రతిపాదనకు పచ్చజెండా
- 31వేల ఎకరాల ఆయకట్టుకు ఊపిరిలూదిన సీఎం చంద్రబాబు
- గ్రామ, వార్డు సచివాలయాల్లో పోస్టుల భర్తీకి ఆమోదంతో ఊరట
- చింతూరు ఆసుపత్రి 50 నుంచి వంద పడకలుగా మార్పునకు ఓకే

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జగ్గంపేట నియోజకవర్గంలో కీలకమైన తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం తీపికబురు అందించింది. గత వైసీపీ హయాంలో పైపులైన్లు మరమ్మతుకు గురై మూలనపడ్డ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు ఊపిరి పోశారు. పాడైపోయిన కీలక పైపులైన్ల స్థానంలో కొత్తవి నిర్మించడానికి మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. రూ.51.67 కోట్లతో పనులు చేపట్టేందుకు వీలుగా పరిపాలన ఆమోదం ఇచ్చే ప్రతిపాదనకు పచ్చజెండా ఊపింది. దీంతో 31వేల ఎకరాల ఆయకట్టుకు తిరిగి నీరు అందబోతోంది. గండేపల్లి మండలం తాళ్లూరు వద్ద నిర్మించిన ఈ పథకం ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు గురైంది. దీనికి శంకుస్థాపన నుంచి టెండర్లు పిలిచి పనుల ప్రారంభం వరకు అప్పట్లో టీడీపీ ప్రభుత్వంలోనే జరిగింది. తీరా వైఎస్ సీఎం అయిన తర్వాత ప్రాజెక్టు పనుల్లో మార్పులు చేశారు. సాగునీరు ప్రవహించడానికి ఇనుప పైపులు బదులు సిమెంట్ పైపులు వినియోగించారు. దీంతో కాలక్రమేణా సిమెంట్ పైపులపై ఒత్తిడి పెరిగి ఎందుకు పనికి రాకుండా పోయాయి. గత వైసీపీ హయాంలో వీటికి మరమ్మతులు చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. దీంతో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దాదాపు 14సార్లు సీఎం చంద్రబాబు దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. చంద్రబాబు మానసపుత్రికలాంటి ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదల చేయాలని కోరారు. దీంతో ప్రయత్నాలు ఫలించి పీఎస్‌సీ ప్రెజర్ మెయిన్‌ను ఎంఎస్ ప్రెజర్ మెయిన్‌తో మార్చే పనికి టెండర్లను ఆహ్వానించి రూ.51.67 కోట్లతో పరిపాలన ఆమోదం ఇచ్చే ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదించింది. దీనిపై ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్పందిస్తూ సీఎం చంద్రబాబు రుణం తీర్చుకోలేనిదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పైపులైన్ల మరమ్మతులకు నిధులు అడిగితే రూ.25 లక్షలు విదిల్చారని, కానీ ఇప్పుడు సీఎం చంద్రబాబు రూ.51.67కోట్లు విడుదలకు నిర్ణయించడం గొప్ప విషయమన్నారు. ఇక గ్రామ, వార్డు సచివాలయాల్లో డిప్యుటేషన్, అవుట్ సోర్సింగ్ విధానం కింద 2,778 పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న 1,500 పోస్టుల్లో 700వరకు పోస్టులను భర్తీ చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. అలాగే చింతూరులో ఉన్న 50పడకల ఆసుపత్రిని వంద పడకలస్థాయికి పెంచుతూ ఆమోదించింది.

వరద గోదారి



రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద వరద ఉధృతి

- ఎగువ నుంచి గోదావరికి భారీగా వచ్చి చేరుతున్న వరద
- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- అఖండ గోదావరిలో ఉగ్రరూపం.. ఘాట్లను ముంచెత్తుతూ ప్రవాహం
- మునుగుతున్న లంకలు.. సురక్షిత ప్రాంతాలకు మత్స్యకార కుటుంబాలు
- 400 మంది పునరావాస కేంద్రాలకు తరలింపు.. భోజన, వసతి ఏర్పాట్లు
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు.. బాధితులకు కలెక్టర్ పరామర్శ



రాజమహేంద్రవరం సమీపంలో బ్రిడ్జిలంక నుంచి బోటుపై బయటకు వస్తున్న మత్స్యకార కుటుంబాలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఎగువన వర్షాలు కురుస్తుండడంతో గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో అఖండ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. రోడ్ కం రైలు బ్రిడ్జి సహా అన్ని బ్రిడ్జిలను శరవేగంగా తాకుతూ వరద పరవళ్లు తొక్కుతోంది. ఇటు రాజమహేంద్రవరం, అటు కొవ్వూరు వైపు ఉన్న ఘాట్లన్నీ వరదలో మునిగి ఉన్నాయి. గోదావరిలో లంకలు నీటమునగడంలో అక్కడ నివసిస్తున్న మత్స్యకార కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వారికి పునరావాస చర్యలను కలెక్టర్ ప్రశాంతి ఇప్పటికే చేపట్టారు. ఇక ధవళేశ్వరం బ్యారేజీ నుంచి రాత్రి పది గంటలకు 12,12,742 క్యూసెక్కుల వరద దిగువకు సముద్రంలోకి వెళుతోంది. దాంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో ప్రతి ఏడాది మాదిరిగానే గోదావరి లంకలు వరద బారిన పడ్డాయి. కొన్ని ఇళ్లు మునిగిపోయాయి. దీంతో మత్స్యకార కుటుంబాలను అధికారులు పునరావాస కేంద్రానికి తరలించారు. ఆల్కాట్ గార్డెన్ సమీపంలోని కల్యాణ మండపంలో వరద ప్రభావిత కుటుంబాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. పడవలను ఒడ్డున లంగరు వేసి అక్కడి కొందరు మత్స్యకార యువకులు కాపలా ఉంటున్నారు. మిగతా వాళ్లు పునరావాస కేంద్రంలో ఉన్నారు. కేతావారిల లంక, వెదుర్లమ్మ లంక, బ్రిడ్జి లంక, గౌతమీ ఘాట్ లంక నుంచి సుమారు 400 మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. ఇక్కడ అవసరమైన అన్ని వసతులను అర్బన్ తహశీల్దారు పీహెచ్‌జీ పాపారావు చూస్తున్నారు. సచివాలయ సిబ్బంది వంతుల వారీగా విధులు నిర్వర్తిస్తూ ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నారు. ఉదయం ఆరు గంటలకు రెండు రకాల టిఫిన్, టీ, సాయంత్రం 4గంటలకు స్నాక్స్, టీ, కాఫీ, మధ్యాహ్నం 12 గంటలకు, రాత్రి 7 గంటలకు స్వీటు, రెండు కూరలు, పచ్చడి, సాంబారు, పెరుగు, వడియాలతో భోజనం వడ్డిస్తున్నారు. చిన్న పిల్లలకు పాలు అవసరమైతే అందిస్తున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ మిషన్, మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి పలు రకాల మందులను అందుబాటులో ఉంచారు. దీంతో తమను కన్నబిడ్డల్లా చూసుకుంటున్నారని మత్స్యకార మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. కాగా వైసీపీ ప్రభుత్వ హయాంలో వరద పునరావాస కేంద్రాలోని వాళ్లకు ఉదయం టిఫిన్, టీ, మధ్యాహ్నం, రాత్రి భోజనానికి కలిపి ప్రైవేటు కేటరింగ్ వాళ్లకు రూ.320 ఇచ్చేవారు. ఇప్పుడు రూ.30 పెంచి నాణ్యమైన భోజనం ఆహారం అందించాలని ఆదేశించింది. ఇక పునరావాస కేంద్రంలో 120 మంది వరకూ మహిళలు ఉన్నారు. వీళ్లలో ఐదుగురు గర్భవతులు ఉన్నారు. అలాగే 70 ఏళ్లు నిండిన వృద్ధులు, నడుంనొప్పి వంటి రుగ్మతలు ఉన్నవాళ్లు కూడా నేలపై పడుకోడానికి ఇబ్బందిపడుతున్నారు. వాళ్లకైనా మంచాలు ఏర్పాటు చేయాలని మత్స్యకార పెద్దలు కోరుతున్నారు. గర్భవతులకు వారి కోరిక మేరకు మరింత పౌష్టికాహారం అందించాలని, పిల్లల వరకైనా భోజనంలో ఉడికించిన గుడ్డు ఉంటే ఇష్టంగా తింటారని అంటున్నారు.

ఇక్కడే వండించండి : కలెక్టర్

పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ ప్రశాంతి గురువారం ఉదయం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిశుభ్రత పాటించాలని, సురక్షిత తాగునీరు మాత్రమే అందుబాటులో ఉంచాలని చెప్పారు. భోజనంలో మసాలాలు ఎక్కువవుతున్నాయని, పిల్లలు తినడం కష్టమవుతోందని మత్స్యకారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పునరావాస కేంద్రంలో వారికి తగినట్టు అక్కడే వండించాలని ఆమె ఆదేశించారు.

పరిస్థితిని పర్యవేక్షించిన ఆర్డీవో

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల నేపథ్యంలో బ్రిడ్జిలంకలో ఉన్న మత్యకార కుటుంబాలకు చెందిన 40 మందిని చందాసత్రంలో నగరపాలక సంస్థ ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. గురువారం రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ స్వయంగా మత్సకారుల వద్దకు వెళ్లి 40 మందిని బోట్లలో తరలింపజేశారు. వరదలు పెరుగుతున్నందున మత్స్యకారులెవరూ లంకల్లో ఉండవద్దని సూచించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.







ఆల్కాట్ గార్డెన్ సమీపంలో కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రం.. పునరావాస కేంద్రంలో ఉన్న వారితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి.. నిరాశ్రయులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణనాయక్

వచ్చే నెలలో గృహయోగం

- జిల్లాలో 10,794 ఇళ్లను సిద్ధం చేసే యత్నం
- ఇప్పటికే 6,974 పూర్తి

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

పేదలకు గృహయోగం రానుంది. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పేదలకు సొంతింటి కలనెరవేరబోతోంది. వచ్చే నెలలో జిల్లాలో 10,794 ఇళ్లను పూర్తిచేసి పేదలు గృహ ప్రవేశం చేసేలా జిల్లా యంత్రాంగం ప్రయత్నిస్తోంది. కలెక్టర్ పి.ప్రశాంతి నిత్యం గృహ నిర్మాణాలను ప్రగతిని పరిశీలిస్తూ పనుల్లో వేగం పెంచారు. రాజధానిలో బుధవారం జరిగిన గృహ నిర్మాణశాఖ అధికారుల సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయంపై స్పష్టమైన ఆదేశాలిచ్చినట్టు సమాచారం. ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబరు నెలలో పేదల గృహ ప్రవేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. జిల్లాలో చాలా ఇళ్ల నిర్మాణంలో ఉన్నప్పటికీ, సెప్టెంబరులో 10,794 ఇళ్లలోకి గృహ ప్రవేశాలు ఉండేలా చూడనున్నారు. ఇప్పటికే 6,974 ఇళ్లను పూర్తిచేశారు. ఈనెలాఖరు నాటికి చాలా వరకూ పూర్తి చేసే లక్ష్యంతో అధికారులు చర్యలు చేపట్టారు. సెప్టెంబర్ నెలాఖరులోపు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించి పేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చనున్నారు. అయితే కొన్ని మండలాల్లో వివిధ సమస్యలతో ఇళ్ల నిర్మాణం నెమ్మదిగా జరుగుతోంది. అధికారులు మాత్రం సుమారుగా పూర్తవుతాయని, గృహ ప్రవేశాలకు సిద్ధమవుతామని చెబుతున్నారు. రాజమండ్రి అర్బన్ పరిధి పేదల కోసం వెలుగుబందలో 3096 ఇళ్లను నిర్మిస్తున్నారు. ఇప్పటివరకూ 2,784 పూర్తయ్యాయి. ఇది 90 శాతం. ఇంకా 312 ఇళ్లు పూర్తి చేయవలసి ఉంది. అవి వివిధ దశల్లో ఉన్నాయి. ఇవి కాకుండా ఎన్టీఆర్ గృహ నిర్మాణం కింద జిల్లాలో 1,483 మందిని ఎంపిక చేశారు. సొంత స్థలం ఉన్నవారిని ఇంటి రుణం మంజూరు చేయడం ఈ పథకం లక్ష్యం. కానీ చాలామంది ఇళ్లను శ్లాబ్ వరకూ నిర్మించి నిధుల కోసం ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. వీటికి కూడా సత్వరం రుణాలు ఇవ్వడానికి వీలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు సంబంధిత అధికార్లను ఆదేశించారు. లేఅవుట్లలో మిగతా ఇళ్ల నిర్మాణాలను జనవరికి పూర్తి చేసే లక్ష్యాలను నిర్దేశించారు.

మండలాల వారీగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు

మండలం	గృహాల లక్ష్యం	నిర్మాణం పూర్తి	పెండింగ్
గోపాలపురం	474	364	110
నల్లజర్ల	563	429	134
నిడదవోలు	338	247	91
దేవరపల్లి	699	510	189
రాజానగరం	289	207	82
కోరుకొండ	266	188	78
గోకవరం	211	143	68
పెరవలి	138	88	50
తాళ్లపూడి	284	173	111
నిడదవోలు అర్బన్	223	125	98
కడియం	219	122	97
రంగంపేట	304	154	151
ఉండ్రాజవరం	306	143	163
కొవ్వూరు అర్బన్	595	272	323
చాగల్లు	385	169	216
రాజమండ్రి రూరల్	295	125	175
కొవ్వూరు రూరల్	460	193	267
సీతానగరం	269	96	173
బిక్కవోలు	695	228	467
అనపర్తి	685	215	470

37 స్టాక్ పాయింట్లలో 12,97,874 మె.టన్నుల ఇసుక : కలెక్టర్

రాజమహేంద్రవరంసిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 37 స్టాక్ పాయింట్లలో 12,97,874 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన చేస్తూ వర్షాల కారణంగా ఎక్కడా ఇసుక కొరతలేకుండా ముందుగానే ఇసుకను స్టాక్ పాయింట్లలో అవసరాలకు తగ్గట్టుగా అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇతర జిల్లాల అవసరాల కోసం 3,57,993 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని చెప్పారు. అరికిరేవుల ఎస్ఎం స్టాక్ పాయింట్‌లో 69,748 మెట్రిక్ టన్నులు, చిడిపి మాన్యువల్ రీచ్ స్టాక్ పాయింట్‌లో 20,457 మెట్రిక్ టన్నులు, చిడిపి ఎస్ఎంలో 59,432 మెట్రిక్ టన్నులు, దొండగుంట-1డిసిల్ట్ పాయింట్‌లో 26,509 మెట్రిక్ టన్నులు, ధవళేశ్వరం స్టాక్ పాయింట్‌లో 1,01,096 మెట్రిక్ టన్నులు, ఏరినమ్మ-1స్టాక్ పాయింట్‌లో 2,976 మెట్రిక్ టన్నులు, జీడిగుంట ఎంఆర్ స్టాక్ పాయింట్‌లో 18,505 మెట్రిక్ టన్నులు, కాకరపర్రు స్టాక్ పాయింట్‌లో 43,407 మెట్రిక్ టన్నులు, కాటవరం స్టాక్ పాయింట్‌లో 12, 142 మెట్రిక్ టన్నులు, కాతేరు స్టాక్ పాయింట్‌లో 77,442 మెట్రిక్ టన్నులు, కోటిలింగాలు-2 స్టాక్ పాయింట్‌లో 27,432 మెట్రిక్ టన్నులు, కుమారదేవం -1 స్టాక్ పాయింట్‌లో 20,989 మెట్రిక్ టన్నులు తదితర స్టాక్ పాయింట్లలో జిల్లా అవసరాలకు 9,39,881 మెట్రిక్ టన్నులు ఇసుక అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు.

ఆవిష్కరణలు ఒక అలవాటు కావాలి

- సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి.. విజయవంతంగా రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్-2025.. 150 టీమ్‌లు హాజరు
- యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని హామీ.. హాజరైన రుడా చైర్మన్ వెంకట రమణచౌదరి



ఉత్తమ ప్రదర్శనకు జ్ఞాపిక అందిస్తున్న ఆదిరెడ్డి, బొడ్డు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): యువత వినూత్న ఆలోచనలతో ఆవిష్కరణలను ఒక అలవాటుగా చేయడమే తమ లక్ష్యమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. మహా నగరాల్లో మాత్రమే నిర్వహించే ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్‌ను 'రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్-2025' పేరుతో రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నిర్వహించారు. గురువారం హోటల్ మంజీరాలో భవాని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో నిర్వహించిన ఈ సమ్మిట్-2025లో 150 టీమ్‌లు తమ ఆవిష్కరణలతో హాజరయ్యారు. తొలుత ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వాసు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, జనసేన నగర అధ్యక్షుడు వై శ్రీనులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ వరల్డ్ ఎంటర్ ప్రెన్యూర్ డేను పురస్కరించుకుని ఒకరోజు ముందుగానే రాజమహేంద్రవరంలో తమ ట్రస్టు సౌజన్యంతో వినూత్న రీతిలో ఐడియా పిచ్ పేరుతో యువతలో నైపుణ్యాలు ప్రదర్శించడానికి ఈ వేదిక చక్కటి అవకాశం కల్పించిందన్నారు. ఈ వర్క్‌షాపులో సుమారు 150 టీమ్‌లు వారి ఆవిష్కరణలతో హాజరుకావడం గొప్ప విషయమని అభినందించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వారు యువ పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి దోహదపడేందుకు ఈ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందన్నారు. 15 నెలల కిందట తాను రాజమండ్రి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే ఇంక్యూబేషన్ సెంటర్‌గా తీర్చిదిద్దుతానని, యువత అద్భుతాలు చేస్తారని తాను యువనేత నారా లోకేశ్‌కు ఆనాడే చెప్పానని, తన మాటలు విన్న కొందరు ఇంక్యూబేషన్ సెంటర్ ఏమిటన్నట్టు మాట్లాడారని గుర్తుచేశారు. తన ఆలోచనలకు తగినట్టుగానే కూటమి ప్రభుత్వం అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుచేసి మరో ఐదు కేంద్రాల్లో కూడా వాటి ఏర్పాటుకు అనుమతి ఇచ్చిందని, అందులో రాజమండ్రిని ఎంచుకున్నందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణచౌదరి మాట్లాడుతూ భవాని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఇలాంటి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్ నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. ప్రధాని మోదీ వికసిత భారత్ ఆశయాలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ముందుకు తీసుకువెళ్తూ ప్రతి ఇంటిలోను ఒక పారిశ్రామికవేత్త ఉండేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.



సమ్మిట్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి, రుడా చైర్మన్ బొడ్డు, సీఈవో ఆరుమిల్లి తదితరులు

ఆ ప్రాజెక్టుకు రూ.కోటి 50 లక్షలు వెచ్చిస్తాం : ఆరుమిల్లి

రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్-2025లో ప్రదర్శించిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ ఆధునిక ప్రపంచానికి తగ్గట్టుగా నేటి తరం, అలాగే భవిష్యత్ తరాలకు తగిన విధంగా రూపొందించిన ప్రాజెక్టుల్లో ప్రెషపాడ్ హెల్మెట్ తిసిన్నికెన్ట్ మిషన్ ప్రాజెక్టు ఎంతో ఆకర్షణగా ఉండి నచ్చడంతో ఈ ప్రాజెక్టులో ఇన్వెస్ట్‌మెంట్ పెట్టేందుకు జార్విస్ సంస్థ సీఈవో ఆరుమిల్లి ముందుకు వచ్చారు. సుమారు కోటి 50 లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టేందుకు ఆయన ఆసక్తి చూపారు. అలాగే మార్విన్ ఏరో స్పేస్ ప్రాజెక్టు కూడా ఆయనకు నచ్చడంతో ఆ ప్రాజెక్టుకు కూడా ఆయన పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆరుమిల్లి మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో చాలా చక్కటి సమ్మిట్ జరిగిందన్నారు. ప్రతి ప్రాజెక్టు చాలా సృజనాత్మకంగా భవిష్యత్తు తరాలకు బాగా ఉపయోగపడేలా ఉన్నాయని పేర్కొన్నారు.

రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్-2025లో ప్రథమ బహుమతి విజేత అమలాపురం టీమ్ 8

భూగర్భ జలాల పునరుద్ధరణకు చర్యలు

- స్వామిత్ర సర్వే వేగవంతం
- లోవోల్టేజీ ఉండొద్దు
- కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ విధానంలో సమావేశమయ్యారు. కలెక్టరేట్ నుంచి ప్రశాంతి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రీ-మాన్సూన్ భూగర్భజల స్థాయి 8మీటర్లకంటే ఎక్కువ లోతులో ఉన్న గ్రామాల్లో భూగర్భ జలాల రీచార్జి కోసం ఉపాధి హామీ పథకం ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సుమారు 80 గ్రామాల్లో భూగర్భ జలాలు నిర్ధారిత స్థాయి కంటే ఎక్కువ లోతుకు వెళ్లిపోయినట్టు భూగర్భ జలాల విభాగం సర్వేలో తేలిందన్నారు. ఆ గ్రామాల్లో చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, పెర్కొలేషన్ ట్యాంకులు, రీచార్జి పిట్లు వంటి వాటర్ కన్జర్వేషన్ పనులు వెంటనే చేపట్టాలని చెప్పారు. సెప్టెంబరు 1 నాటికి జిల్లాలో ఎంత మేరకు నీరు నిల్వలో ఉందో, ఎంత మేర కన్జర్వేషను పనులు జరిగాయనే వివరాలతో వాటర్ బులెటిన్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాల్సి ఉందన్నారు. గ్రామ కంఠాల్లోని ఇళ్లకు, ఖాళీ స్థలాలకు యాజమాన్య హక్కులు కల్పించడానికి చేపట్టిన 'స్వామిత్ర సర్వే'ను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో రెండో దశలో 102 గ్రామాల్లో రీ-సర్వే జరగాల్సి ఉండగా ఇప్పటి వరకూ 65 గ్రామాల్లో పూర్తయిందని, మిగిలిన వాటి విషయంలో కూడా త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు చెప్పారు. ఈ నియామకాలతో ప్రభుత్వం తరపున న్యాయ వ్యవహారాల నిర్వహణ వేగం అవుతుందన్నారు. అలాగే లో-వోల్టేజీ సమస్యలు రాకుండా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జేసీ చిన్న రాముడు, డీఆర్వో సీతా రామమూర్తి, సీపీవో అప్పలకొండ, డీఎల్‌డీవోలు వీణాదేవి, స్లీవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాము కలెక్టర్ తనిఖీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌సీఐ గోదాముల్లోని ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, తహశీల్దారు పాపారావుతో కలిసి కలెక్టర్ పి.ప్రశాంతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతి నెలా ఈవీఎంలు భద్రపరిచిన గోదామును తనిఖీ చేస్తున్నామన్నారు. ఈవీఎం యూనిట్లను అత్యంత భద్రతతో స్ట్రాంగ్ రూములో ఉంచామని, సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. కెమెరాల పనితీరును కూడా పరిశీలించామని తెలిపారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెరవలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు - కానూరు విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణ అప్పారావు పేర్కొన్నారు. అలాగే కానూరు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా కానూరు, నడిపల్లి, కానూరు అగ్రహారం, ఉనులుమర్రుకు సరఫరా ఉండదన్నారు.



చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, డైరెక్టర్లచే ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



సమావేశంలో పాల్గొన్న ఆప్కాబ్ చైర్మన్ గన్ని, ఎమ్మెల్యేలు ముప్పిడి, ఆరిమిల్లి, నాయకులు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు
- అట్టహాసంగా కొలువుదీరిన కొవ్వూరు ఏఎంసీ నూతన పాలకవర్గం
- పెద్దసంఖ్యలో హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కొవ్వూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. కొవ్వూరు పరిమి రామారాయుడు రత్తమ్మ కల్యాణ మండపంలో గురువారం కొవ్వూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఆంధ్రాసుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు), ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హాజరై ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, ఇతర డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న గన్ని ముందుగా ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో వందలాది ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతు సంక్షేమానికి పాటుపడాలని, యువకుడికి ఏఎంసీ చైర్మన్ పదవి ఇచ్చి బాధ్యతను అప్పగించడం చాలా సంతోషమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పతకాలను రైతులకు అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోనే సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ అయ్యిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అమలుచేస్తూ ప్రజలకు సుపరిపాలన అందజేస్తున్నారు. వైసీపీ నాయకులు, జగన్మోహనరెడ్డి ఎక్కడికి వెళ్లినా రెచ్చగొట్టే ప్రసంగాలు, కపట రాజకీయాలు చేస్తున్నారన్నారు. మరో 15 సంవత్సరాలు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండాలని పవన్‌కల్యాణ్ చెబుతున్నారు. మూడు పార్టీల నాయకులు చిన్నచిన్న ఇబ్బందులు ఉన్నప్పటికీ కలిసి పని చేయాలన్నారు. రాష్ట్రానికి మరలా ముఖ్యమంత్రి అయ్యే అర్హత జగన్మోహనరెడ్డికి లేదన్నారు. సొంతజిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలలో డిపాజిట్లు కోల్పోవడమే దీనికి నిదర్శమన్నారు. కార్యక్రమంలో అల్లూరి విక్రమాదిత్య, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, గొర్రెల శ్రీదర్, ఆళ్ల హరిబాబు, మున్సిపల్ చైర్మన్ బావన రత్నకుమారి, బీజేపీ జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, ప్రజా ప్రతినిదులు, సొసైటీ అధ్యక్షులు కూటమి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి



గోష్పాదక్షేత్రం వద్ద ప్రవహిస్తున్న నది

కొవ్వూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నదీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ నుంచి అధికంగా వరద రావడంతో కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని స్నానఘట్టాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. ఎగువన భద్రాచలం, దిగువన ధవళేశ్వరం బ్యారేజీల వద్ద ప్రమాద హెచ్చరికలు దాటి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. వరద మరింత పెరిగితే శుక్రవారం ఉదయానికి ప్రవాహం గోష్పాదక్షేత్రంలోకి చేరుకునే అవకాశం ఉంది. దీంతో పుణ్య స్నానాలు చేయడానికి వచ్చిన భక్తుల రక్షణార్థం అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న వారిని తరలించడానికి పునరావాస కేంద్రాలు ఏర్పాటుకు పాఠశాలలను గుర్తించారు. అలాగే డివిజనల్ పరిధిలో ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు. మరోపక్క గోదావరి ప్రమాదకరంగా ప్రవహిస్తున్నప్పటికీ పరిసర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా రెవెన్యూ, పోలీసు సిబ్బందితో పికెటింగ్‌లు ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

కొవ్వూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం అంగన్‌వాడీలు నల్లచీరలు ధరించి బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సీహెచ్ పుష్ప మాట్లాడుతూ 42 రోజుల చారిత్రక సమ్మెలో భాగంగా కూటమి అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చినా... ఆ దిశగా కృషి చేయడం లేదన్నారు. అలాగే ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారానే సరుకులు ఇవ్వాలన్న నిబంధనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీహెచ్ బ్రహ్మమ్మ, వి.వసంత, సీహెచ్ భవాని, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: లబ్ధిదారులకు నష్టదాయకంగా ఉన్న ఎఫ్ఆర్‌సీ యాప్‌లను రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం దేవరపల్లిలో బస్టాండ్ వద్ద ఆందోళన నిర్వహించారు. వివిధ కార్మిక సంఘాల నేతలు లక్ష్మి, పద్మ కామేశ్వరి, కొడవటి కుమారి, కవల పోసమ్మ, మంగతాయారు, కే.దేవి, సావిత్రి, భవాని, రైతు సంఘం నేతలు ఉండవల్లి కృష్ణారావు, జుట్టా అనీల్ కుమార్, కే.రత్నాజీ , తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది కొద్దిసేపు నిరసన నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల వరకు యథావిధిగా విధులు నిర్వ హించి అనంతరం చాగల్లు సెంటర్‌కు చేరుకుని మానవహారంగా ఏర్పడి వారి హక్కుల సాధన కోసం నిరసన తెలిపారు. కనీస వేతనాలు అమలు చేయాలని, గ్రాట్యూటీ చట్టం ప్రకారం చెల్లించాలని వారు డిమాండ్ చేసారు. చాగల్లు అంగన్‌వాడీ సంఘం నాయకులు పీ. విజయ కుమారి, జీ. గంగారత్నం, రమాదేవి, పుష్పలత పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆ వర్కర్స్ పెరవలి ప్రాజెక్టు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జువ్వల రాంబాబు పేర్కొన్నారు. ఉండ్రాజవరంలో గురువారం మండలానికి చెందిన అంగన్‌వాడీ వర్కర్లంతా కలిసి మానవహారం, ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్ల సంఘ నాయకులు ఎస్. రంగనాయకమ్మ, కే. లక్ష్మి, గిరిజ, రామలక్ష్మి, లక్ష్మీకుమారి, తదితరులు పాల్గొన్నారు.

1న బీజేపీ భారీ ర్యాలీ

కొవ్వూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల ఒకటో తేదీన రాజమహేంద్రవరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలతో భారీ ర్యాలీ, సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తెలిపారు. గురువారం మద్దూరులో మండల అధ్యక్షురాలు డేగల సునీత ఆధ్వర్యంలో పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఎంపీటీసీ నాగరాజు, పీ.నాగమణి, పెరుగు పోతురాజు, డేగల రాంబాబు, బెల్లపుకొండ మణికంఠ, చౌటిపల్లి బాబ్జీ, అత్తిలి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

చాగల్లు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాగల్లు సెంటర్‌లోని శ్రీవేణు గోపాలస్వామి వారి ఆలయంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు ముగింపు సందర్భంగా గురువారం అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. యాదవ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో జరిగింది. యువకులు ఉత్సాహంగా పాల్గొని సేవలందించారు.

గంజాయి మత్తులోనే హత్యలు?

- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు కోటేశ్వరరావు

నల్లజర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘంటవారిగూడెంలో సంచలనం సృష్టించిన దంపతుల హత్యలో నిందితుడు, గంగన్నగూడెంకి చెందిన మారిదు కోటేశ్వరరావు గురువారం పోలీసులకు లొంగిపోయాడు. గంజాయి మత్తులోనే దారుణానికి పాల్పడినట్టు స్థానికులు పేర్కొంటున్నారు. అత్తమామలను చంపిన అనంతరం నిందితుడు తన తల్లికి ఫోన్ చేసి మాట్లాడుతూ తన అత్తమామలను నరికి చంపేశాను. మూడునెలలు జైల్లో ఉండి వస్తాను... నువ్వు కంగారు పడొద్దని సంఘటనా స్థలం నుంచే మాట్లాడినట్టు అక్కడివారు చెబుతున్నారు. కాగా, మామ ఏకుల సుబ్బారావు, శారద మృతదేహాలకు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

రామకృష్ణకు పరామర్శ

ఉండ్రాజవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ సోదరుడు (అన్నయ్య) సింహాద్రి రామారావు మృతి వార్తను తెలుసుకున్న తణుకు ఎమ్మెల్యే ఆరుమిల్లి రాధాకృష్ణ గురువారం ఉండ్రాజవరం వచ్చి సంతాపం వ్యక్తం చేశారు. అలాగే రాజమండ్రి పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బొడ్డు రామాంజనేయులు, నిడదవోలు నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు అబ్బిశెట్టి సత్తిరాజు, టీడీపీ నాయకులు వెలిచేటి ప్రసాద్, భోగవల్లి బాపయ్య, పెన్మెత్స వెంకటేశ్వరరాజు పరామర్శించారు.

మణిశంకర్‌కు ...

తాళ్లపూడి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పెద్దేవంలో రాఖీపౌర్ణమి రోజున మృతిచెందిన తండ్రీ, కొడుకులు గుండేపల్లి మణిశంకర్, శ్రీను కుటుంబాన్ని గురువారం జనసేన పార్టీ మండలాధ్యక్షుడు గంటా కృష్ణ జనసైనికులతో కలిసి వెళ్లి పరామర్శించారు. విషయాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ కార్యాలయంలో తెలిపామని చెప్పారు. కార్యక్రమంలో నామన చినబూరయ్య, దేవన సత్యనారాయణ, వీకే రంగారావు, కాపవరం సొసైటీ అధ్యక్షుడు సుంకర సత్తిబాబు, ఏఎంసీ డైరెక్టర్ కొప్పాక విజయ్‌కుమార్, వీరమళ్ల నారాయణ, సిద్దంశెట్టి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

'అప్రమత్తంగా ఉండాలి'

పెరవలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువ భాగంలో వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో మండలంలోని నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ నిరంజన్ పేర్కొన్నారు. గురువారం గోదావరి తీర ప్రాంత గ్రామాల్లో ఆయన పర్యటించారు. అనంతరం పలు సూచలను చేశారు. సిబ్బంది ఉన్నారు.

'సూపర్ సిక్స్'.. సూపర్ హిట్

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



కొవ్వూరు పట్టణంలో ట్రాక్టర్ల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ పథకాల హామీలు.. ప్రస్తుతం సూపర్ హిట్ అవుతున్నాయని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొవ్వూరు బాపూజీనగర్ శివానంద మున్సిపల్ పార్క్ వద్ద అన్నదాత సుఖీభవ విజయోత్సవ ట్రాక్టర్ల ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ర్యాలీ ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణం, బస్టాండ్, జూనియర్ కాలేజ్, విజయవిహార్ ఆర్డీవో కార్యాలయం మీదుగా వేములూరు, పశివేదల నుంచి చాగల్లుకు చేరుకుంది. అక్కడి నుంచి పంగిడి, కాపవరం, దొమ్మేరు కొవ్వూరు వరకు వెళ్లింది. రైతుల ఖాతాలో ఇటీవల అన్నదాత సుఖీభవ మొదటి విడత సొమ్ములు జమ చేయడంతో కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పొట్రు శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు వట్టికూటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు చావా శ్రీనివాస్, సుంకర సత్తిబాబు, గొరిజాల సురేష్, మంకిన వీర్రాజు, కేవీకే రంగారావు, యనమదల సుబ్రహ్మణ్యం, వేమగిరి వెంకట్రావు, కిలాని రమణ, వై.వీరభద్రరావు, మద్దుకూరి సురేష్, మాదిరెడ్డి సతీష్, శౌర్య, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో శాశ్వత భవనాలు నిర్మించాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘ నాయకులు

కొవ్వూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శాశ్వత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్ అన్నారు. ఎస్ఎఫ్ఐ బృందం గురువారం కళాశాలను సందర్శించింది. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ కళాశాలలో శాశ్వత భవన నిర్మాణాలకు నిధులు కేటాయించి, తక్షణమే పనులు ప్రారంభించాలన్నారు. అలాగే ఈనెల 25వ తేదీన విద్యారంగ సమస్యలపై ఛలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ నేతలు కె.జోతిర్మయి, కార్తీక్, సంతోషి, మధు ప్రియ, విజయ్, చరణ్, లోహిత్, వినోద్‌కుమార్, సునీల్, రేష్మ పాల్గొన్నారు.

భారీ ఊరేగింపుగా ..

తరలిన తెలుగు తమ్ముళ్లు



చాగల్లులో ఎడ్లబండిపై ఊరేగింపుగా వెళ్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, టీడీపీ సీనియర్ నేత అచ్చిబాబు, తదితరులు

చాగల్లు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చి, ప్రజల మన్ననలు పొందుతామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరులో ఏఎంసీ చైర్మన్‌గా నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి ప్రమాణ స్వీకారోత్సవం గురువారం నిర్వహించారు. దీనికి మండల కేంద్రమైన చాగల్లు నుంచి పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఊరేగింపుగా తరలివెళ్లారు. ముందుగా సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ సీనియర్ నేత పెండ్యాల అచ్యుత రామయ్య (అచ్చిబాబు) నివాళి అర్పించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీలో వందలాది ట్రాక్టర్లు, కార్లు, బైక్‌లు బయలుదేరాయి. బెలూన్లతో అలంకరించిన ట్రాక్టర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యూనియన్ బ్యాంకు వద్ద వర్తక సంఘం నాయకుడు పెంజర్ల గణేష్, ఆయన కుమారులు క్రేన్ సహాయంతో గజమాలను అచ్చిబాబుకు వేసి అభిమానాన్ని చాటుకున్నారు. ఏఎంసీ చైర్మన్ శ్రీరామ్ చౌదరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో టూమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, మాజీ ఎంపీపీ కేతాసాహెబ్, టీడీపీ నేతలు ఈడుపుగంటి సుబ్బారావు, బొల్లిన శివనాగేంద్ర, బొడ్డు కేశవకుమార్, బొడ్డు రాజు, గూడపాటి వెంకట్, గారపాటి శ్రీనివాసరావు, గారపాటి బాబూరావు, మద్దిపాటి వీరరాఘవులు, ఉప్పులూరి శ్రీనివాస్, ఈడుపుగంటి మురళీ కృష్ణ, దొంగ రామకృష్ణ, జనసేన మండలపార్టీ అధ్యక్షుడు ఉప్పులూరి చిరంజీవి, నియోజవకర్గ స్థాయిలో కూటమి నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ ట్రాక్టర్ ర్యాలీకి ..

తాళ్లపూడి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరులో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ పథకం ర్యాలీకి గురువారం మండలంలోని రైతులు, కూటమి నేతలు ట్రాక్టర్లు, మోటారు సైకిళ్లపై భారీ సంఖ్యలో తరలివెళ్లారు. బల్లిపాడు కాకర్ల కల్యాణమండపం వద్ద పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు సమూహంగా కొవ్వూరు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో యువగళం నాయకుడు కాకర్ల సత్యేంద్ర మాట్లాడుతూ ఎన్డీయే కూటమిప్రభుత్వం రైతుల శ్రేయస్సుకోరే ప్రభుత్వమన్నారు. అన్నదేవరపేట, గజ్జరం, పోచవరం, తాడిపూడి, తురుగుడుమెట్ట, బల్లిపాడు, వేగేశ్వరపురం గ్రామాలకు చెందిన ఎన్డీయూ కూటమి నాయకులు కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, కాకర్ల శ్రీను, లనపర్తి పరకప్రసాద్, కైగాల శ్రీనివాసరావు, కొర్లపాటి లక్ష్మణరావు, దండమూడి శేషు, దుగ్గిరాల జగదీష్, మద్దుకూరి శంకరం, ఉప్పులూరి రమేష్, అన్నమరెడ్డి రమణ, తిగిరిపల్లి కనకరత్నం, తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే రావూరుపాడు నుంచి మాజీ ఎంపీటీసీ రేకపల్లి ముత్యాలరావు, వైస్ ఏఎంసీ వైస్ చైర్మన్ రేకపల్లి మంగామణి ఆధ్వర్యంలో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, సీనియర్ నేతలు కొఠారు వెంకట్రావు, మలకపల్లి నుంచి మద్దిపాటి ప్రకాశం, ఉప సర్పంచ్ రామారావు, కార్యకర్తలు బయలు దేరి వెళ్లారు.



ట్రాక్టర్లపై ర్యాలీగా వెళుతున్న రైతులు, కూటమి నాయకులు

రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్-2025లో

ప్రథమ బహుమతి విజేత అమలాపురం టీమ్




నగదు బహుమతిని అందుకుంటున్న అనిల్ అండ్ శ్రీ టీమ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం హోటల్ మంజీరాలో భవాని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో నిర్వహించిన రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్-2025లో 150 టీమ్‌లు వారి ఆవిష్కరణలతో హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హాజరుకాగా, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జనసేన రాజమహేంద్రవరం నగరం అధ్యక్షుడు వై శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌లో ప్రథమ బహుమతిని అమలాపురానికి చెందిన అనిల్ అండ్ శ్రీ టీం హెల్ప్‌టూ డినబుల్ ప్రాజెక్టు కైవసం చేసుకుంది. ఇందు కుగాను ప్రథమ బహుమతి కింద రూ.లక్షా 75 వేలు నగదు చెక్కును ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి అందించారు. అదేవిధంగా ద్వితీయ బహుమతిని విశాఖపట్నంకు చెందిన చెన్న వైష్ణవి, శంకర్ డిటీమ్‌పేజో ప్రాజెక్టుకు కైవసం చేసుకుంది. దీనికి రూ.లక్ష నగదు చెక్కును అందించారు. అలాగే తృతీయ బహుమతికి శ్రీకాకుళంకు చెందిన సాయికిరణ్ రూపొందించిన డ్యూయల్ అలెర్ట్ సిస్టమ్ ప్రాజెక్టు కైవసం చేసుకుంది. బహుమతిగా రూ.75 వేలు నగదు చెక్కును అందించారు.

వరద ప్రభావిత గ్రామాల్లో వైద్యశిబిరాలు

కొవ్వూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత గ్రామాల్లో ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేసి ప్రజలకు వైద్యసేవలు అందజేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు గురువారం గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలలో వీటిని ఏర్పాటు చేశామన్నారు. కొవ్వూరు మండలం మద్దూరులంకలో మార్కొండపాడు పిహెచ్‌సీ ఆధ్వర్యంలో జీపీవో సెంటర్‌లో, నిడదవోలు మండలం తాళ్లపాలెంలో సమిశ్రగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పాత జీపీవో సెంటర్‌లో, శెట్టిపేటలో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో, రావిమెట్లలో జీపీవో సెంటర్‌లో క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. క్యాంపులలో వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, అందుబాటులో ఉండి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, అవసరమైన వారికి మందులు ఇవ్వడం, వ్యాధి నివారణ చర్యలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



కవులూరులో చెక్కును అందిస్తున్న టీడీపీ నేతలు

నల్లజర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాధితులకు మంజూరైన రూ. 13,93, 602 లక్షల చెక్కులను గురువారం వారికి పంపిణీ చేసినట్టు పోతవరం మాజీ సర్పంచ్, టీడీపీ నేత పసుమర్తి రతీష్, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ తెలిపారు. ఇందులో కవులూరుకి చెందిన బోలా అమరావతికి రూ. మూడు లక్షల 37 వేలు, దూబచర్ల వసంతి కుమారికి రూ.68 వేలు, సత్య నారాయణకు రూ.45 వేలు, బాషాకు రూ.46 వేలు, కృష్ణకు రూ.41 వేలు, నాగేశ్వరరావుకు రూ. 36 వేలు, ఘంటవారిగూడెంకి చెందిన రవికి రూ.55 వేలు, కవులూరుకి చెందిన బొట్టా లక్ష్మికి రూ.99 వేలు, నాగమణికి రూ.44 వేలు, పుల్లలపాడుకి చెందిన కృష్ణమూర్తికి రూ. రెండు లక్షలు, చంద్రరావుకు రూ.42వేలు, అనుమునిలంకకి చెందిన ఉషోద్‌కిరణ్‌కు రూ.80 వేలు, నల్లజర్లకు చెందిన ప్రశాంత్‌కు రూ.76 వేలు, లావణ్యకు రూ.31వేల 100, జగన్నాథపురం గ్రామానికి చెందిన కృష్ణవేణికి రూ.55 వేలు చెక్కులు అందించారు.

మహిళను కొట్టిన ఇద్దరిపై కేసు

కొవ్వూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మహిళను కొట్టి గాయపర్చిన సంఘటనలో ఇద్దరిపై కేసునమోదు చేసినట్టు కొవ్వూరురూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి... రాజానగరం మండలం నరేంద్రపురానికి చెందిన బాదంపూడి ప్రేమలత కొవ్వూరు మండలం నందమూరులోని బంధువు యంగల మనోహర్ ఇంట్లో పెళ్లికి ఈనెల 14వ తేదీన వచ్చింది. ఇంట్లో వరుసకు కూతురు అయిన బావన కుమార్తెను ఎత్తుకుని ఆడిస్తుండగా ఏడవడంతో పాపను తల్లికి ఇస్తూ నీ కూతురు చాలా శీలిది అనడంతో పక్కనే ఉన్న లలిత తననే అన్నట్లు భావించి ఘర్షణ పడింది. తండ్రి తంబయ్యకు ఫోన్‌చేసి రప్పించిన అనంతరం ఇద్దరూ కలిసి ప్రేమలతపై పిడిగుద్దులు గుద్దులు గుప్పించారు. దీంతో చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా, అక్కడ నుంచి రాజమహేంద్రవరం తరలించారు. ప్రేమలత అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

8 మంది జూదరుల అరెస్టు

దేవరపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి, పల్లంట్ల రోడ్డులోని పోలవరం కుడికాల్వ గట్టు శివారులోని పొదల్లో పేకాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ వీ. సుబ్రహ్మణ్యం తన సిబ్బందితో గురువారం వెళ్లి దాడులు నిర్వహించాట. ఇందులో ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 15,420 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరంతా దేవరపల్లి గ్రామస్థులే.